

నుదుటిపై మూడు నామాలతో

చౌడేపల్లె, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నుదుటిపై మూడు నామాలతో జన్మించిన ఆవుదూడను చూసి అంతా ఆశ్చర్యపోయారు. చౌడేపల్లె మండలం గడ్డంవారిపల్లె పంచాయతీ పెద్దకంపల్లెకు (యల్లంపల్లె) చెందిన రవినాయుడు గత ఏడాది పశువులకు లంపిస్కిన్ వ్యాధి సోకడంతో నయమైతే ఓ దూడను టీటీడీ గోశాలకు ఇస్తానని మొక్కుకున్నాడు. ఆవులకు వ్యాధి నయమైనా పనుల వత్తిడిలో మొక్కు వాయిదా వేస్తూ వచ్చాడు.రెండు రోజుల క్రితం ఓ ఆవు ఒక పేయదూడకు జన్మనిచ్చింది. ఆ దూడకు నుదుటిపై తెల్లరంగులో మూడు నామాలుండడం చూసి స్వామి మొక్కును గుర్తు చేస్తున్నారని రవినాయుడికి అన్పించింది.దీంతో గతంలో గోశాలకు ఇద్దామనుకున్న దూడతో పాటు నామాలతో పుట్టిన దూడను కూడా టీటీడీకి ఇవ్వాలని నిర్ణయించుకున్నాడు.

ఉచిత విద్యుత్తుపై హోరెత్తిన సంబరాలు

కుప్పం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి):ఎంతకాలంగానో తామెదురుచూస్తున్న ఉచిత విద్యుత్తు పరిమితిని కూటమి ప్రభుత్వం పెంచడంతో నాయీ బ్రాహ్మణులు సంబరాలు చేసుకున్నారు. రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడు, టీటీడీ పాలకమండలి సభ్యుడు అయిన వైద్యం శాంతారాం ఆధ్వర్యంలో మంగళవారం కుప్పం పుర వీధుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటాన్ని రథంపై ఊరేగించారు.క్షురకర్మ చేసే నాయీ బ్రాహ్మణుల దుకాణాలకు ఇస్తున్న ఉచిత విద్యుత్తు పరిమితిని 150 యూనిట్లనుంచి 200 యూనిట్లకు పెంచుతూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో నియోజకవర్గవ్యాప్తంగా నాయీ బ్రాహ్మణులు కుప్పం చేరుకుని తిరుపతి గంగమాంబ ఆలయంలో చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యుల క్షేమంకోరుతూ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చంద్రబాబు నిలువెత్తు ఫ్లెక్సీని రథంపై ఉంచి ఆర్టీసీ బస్టాండు కూడలిదాకా ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయీ బ్రాహ్మణులందరూ సన్నాయి, డోలు,



మంగళ వాయిద్యాలతో కంచర్ల, పీఎస్ఎం, శాంతారాం తదితరులు



ఊరేగింపులో పాల్గొన్న నాయీ బ్రాహ్మణులు

శాక్సా ఫోన్ వంటి మంగళ వాయిద్యాలతో శ్రావ్యమైన సంగీతం విన్పిస్తూ ఊరేగింపులో ఉత్సాహంగా ముందుకు సాగారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, పీఎస్.మునిరత్నం, వైద్యం శాంతారాం, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, టీడీపీ నియోజకవర్గ విస్తరణ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సురేశ్‌బాబు తదితరులు సైతం మంగళ వాయిద్యాలు మోగిస్తూ ఊరేగింపు అగ్రభాగాన పయనించారు.ఆర్టీసీ బస్టాండు కూడలిలో నిర్వహించిన కృతజ్ఞతా పూర్వక సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆడితప్పడన్న మాటను మరోసారి రుజువు చేసుకున్నారన్నారు.బీసీలకు ఎన్నటికీ అండగా నిలిచే పార్టీ టీడీపీయేనన్నారు. కడా సభ్యులు డాక్టర్ బీఆర్.సురేశ్‌బాబు, రాజ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, జనసేన నాయకుడు నరేశ్‌బాబు, టీడీపీ నియోజకవర్గ కన్వీనర్ చంద్రశేఖర్, సత్యేంద్ర శేఖర్, రామకుప్పం మండల టీడీపీ అధ్యక్షుడు ఆనందరెడ్డి, నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జ్యోతీశ్వరన్, నాలుగు మండలాల సంఘం అధ్యక్షులు, నాయకులు, నాయీ బ్రాహ్మణులు పాల్గొన్నారు.



ఆకర్షించిన బ్రహ్మ కమలాలు

సదుం,ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సదుంలోని జాండ్రపేటలో సోమవారం రాత్రి 11గంటల సమయంలో ఒకే మొక్కకు పదుల సంఖ్యలో వికసించిన బ్రహ్మ కమలాలు చూపరులను విశేషంగా ఆకర్షించాయి. ఏడాదికి ఒకసారి మాత్రమే అది కూడా పౌర్ణమికి దగ్గరగా రాత్రి వేళల్లో మాత్రమే వికసించే ఈ పుష్పాలు ఇంటి ఆవరణలో పెంచుకుంటే మంచి జరుగుతుందన్నది పలువురి నమ్మకం. ఒకే మొక్కకు సుమారు 100పుష్పాలు ఏక సమయంలో వికసించడంతో ఆ ఇంటి యజమాని ఆకుల శ్రీనివాసులు పరవశించిపోయారు.

పల్లె రోడ్లకు కళ

- రహదారుల అభివృద్ధికి తాజాగా రూ.38.35 కోట్లు
- ఇప్పటికే రూ.222 కోట్లతో విస్తరణ, మరమ్మతులు



గుంతలమయంగా చిత్తూరు-తిరుత్తణి రోడ్డు నుంచి వేలూరు రోడ్డు వయా చీలాపల్లె

చిత్తూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో నిర్వహణ కూడా కరువై ఛిద్రమైపోయిన పల్లె రహదారులకు మంచికాలం నడుస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రహదారులకు ప్రాధాన్యత ఇచ్చి రూ.222 కోట్లతో మరమ్మతులు, అభివృద్ధి చేయగా..తాజాగా మరిన్ని ఆర్అండ్‌బీ రహదారుల అభివృద్ధికి రూ.38.25 కోట్లను విడుదల చేసింది. నాబార్డు, స్టేట్ గవర్నమెంటు ఫండ్స్‌తో మంజూరైన ఈ పనులు టెండర్ దశలో ఉన్నాయి.

రూ.18.95 కోట్ల నాబార్డు నిధులతో..

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో రూ.18.95 కోట్ల నాబార్డు నిధులతో 64 కిలోమీటర్ల మేర రహదారులను అభివృద్ధి చేయనున్నారు. కుప్పంలో 3, పలమనేరులో 2, చిత్తూరు, జీడీనెల్లూరు, నగరి, పూతలపట్టు, పుంగనూరు నియోజకవర్గాల్లో ఒక్కోటి చొప్పున పనులు మంజూరయ్యాయి. ●చిత్తూరు- తిరుత్తణి రోడ్డు నుంచి చిత్తూరు- వేలూరు రోడ్డు వయా చీలాపల్లె 11.72 కి.మీ- రూ.2 కోట్లు (చిత్తూరు నియోజకవర్గం) ●-కుప్పం- సంగనపల్లె రోడ్డు నుంచి అలుగుమానిపల్లె రోడ్డు 3 కి.మీ- రూ.70 లక్షలు (కుప్పం నియోజకవర్గం) ●అడవిబూదుగూరు క్రాస్ నుంచి తమిళనాడు బార్డర్ 4.73 కి.మీ- రూ.1.20 కోట్లు (కుప్పం నియోజకవర్గం) ●కుప్పం- పొగురుపల్లె రోడ్డు నుంచి గుడుపల్లె రోడ్డు 3 కి.మీ- రూ.70 లక్షలు (కుప్పం నియోజకవర్గం) ● రాయలపేట నుంచి మాధవరం రోడ్డు 9.80 కి.మీ- రూ.2.20 కోట్లు (పలమనేరు నియోజకవర్గం) ●కల్లుపల్లె నుంచి చౌడేపల్లె రోడ్డు 1 కి.మీ- రూ.4.45 కోట్లు (పలమనేరు నియోజకవర్గం) ●చిత్తూరు- పుత్తూరు రోడ్డు నుంచి కమ్మకండ్రిగ రోడ్డు వయా పుల్లూరు రోడ్డు 10.4 కి.మీ- రూ.2 కోట్లు (జీడీనెల్లూరు నియోజకవర్గం) ●సీకేటీ రోడ్డు నుంచి పాకాల- దామలచెరువు రోడ్డు వయా అయ్యప్పగారిపల్లె రోడ్డు 9.30 కి.మీ- 2.20 కోట్లు (పూతలపట్టు నియోజకవర్గం) ●ఏపీ రోడ్డు నుంచి ఎంసీఆర్ రోడ్డు వయా అరంట్లపల్లె 3.90 కి.మీ- రూ.1.50 కోట్లు (పుంగనూరు నియోజకవర్గం) ● నగరి ఆర్ఎస్ నుంచి వెంగన్నకండ్రిగ వయా ముడిపల్లె రోడ్డు 7.60 కి.మీ - రూ.2 కోట్లు(నగరి నియోజకవర్గం).



బంగారుపాళ్యం మండలంలో గుంతలమయంగా మంగళంపల్లె రహదారి

రూ.19.40 కోట్ల రాష్ట్రప్రభుత్వ నిధులతో..

రూ.19.40 కోట్ల రాష్ట్ర ప్రభుత్వ నిధులతో 46 కిలోమీటర్ల మేర రహదారుల అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. కుప్పం, పలమనేరు నియోజకవర్గాల్లో 2 చొప్పున, చిత్తూరు, పూతలపట్టు, నగరి నియోజకవర్గాల్లో ఒక్కోటి చొప్పున పనులు మంజూరయ్యాయి. ●గోవిందపల్లె, దండికుప్పం రోడ్డు నుంచి శివరామపురం వరకు రూ.2.10 కోట్లతో 7.2 కి.మీ ● కంచనబల్ల- రామకుప్పం, వీర్నమల రోడ్డు వరకు రూ.2.40 కోట్లతో 9.9 కి.మీ ● ఎంసీబీ రోడ్డు నుంచి నలగాంపల్లె, కేబీఎన్ కండ్రిగ, తంబుగానిపల్లె, మంగళంపల్లె, 65 వెంకటాపురం, బండివాండ్లవూరు రోడ్డు రూ.1.80 కోట్లతో 5.9 కి.మీ ● పుంగనూరు- శంకర్రాయలపేట క్రాస్ రోడ్డు నుంచి బైరెడ్డిపల్లె రోడ్డు వరకు రూ.4.50 కోట్లతో 6.3 కి.మీ ● పలమనేరు నుంచి గుడియాత్తం రోడ్డు వరకు రూ.1.80 కోట్లతో 3 కి.మీ ● నగరి నుంచి నాగలాపురం రోడ్డు వరకు రూ.4.30 కోట్లతో 8.60 కి.మీ ● చిత్తూరు నుంచి గుడియాత్తం రోడ్డు రూ.2.50 కోట్లతో 5 కి.మీ

ఇప్పటికే రూ.222 కోట్ల కేటాయింపు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి జిల్లాలోని రహదారుల అభివృద్ధి, మరమ్మతుల కోసం పలు విడతల్లో రూ.222 కోట్లను కేటాయించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రూ.22 కోట్లతో రహదారుల్ని మరమ్మతు (ప్యాచ్ వర్కులు) చేసింది. రూ.6 కోట్లతో చిత్తూరు- గుడియాత్తం రోడ్డు, రూ.2.35 కోట్లతో చిత్తూరు- గుడిపాల రోడ్లను అభివృద్ధి చేసింది.ఉపాధి హామీ నిధుల్లోంచి రూ.90 కోట్లతో సీసీ రోడ్లు, రూ.30 కోట్లతో బీటీ రోడ్లు పూర్తి చేసింది. రూ.4 కోట్లతో చిత్తూరు ఫారెస్టు రోడ్డును అభివృద్ధి చేసింది. రూ.15 కోట్ల ఉపాధి గ్రాంట్లతో పీఆర్ రోడ్లకు టెండర్లు పిలిచారు. రూ.53 కోట్ల ప్రత్యేక నిధులతో కుప్పం నియోజకవర్గంలో 23 రహదారుల అభివృద్ధి చేపట్టగా.. ఇప్పటికే 13 పనులు పూర్తయ్యాయి. వీటికి తాజాగా విడుదలైన రూ.38.35 కోట్లు అదనం.

153 సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు

చిత్తూరు రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 153 సచివాలయాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు తెలిపారు. మంగళవారం జడ్పీ సమావేశ మందిరంలో డిజిటల్ సహాయకులకు ఆధార్ నమోదుపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సచివాలయాల్లోని డిజిటల్ సహాయకులు బాధ్యతగా పనిచేయాలని ఆదేశించారు. డీఎల్‌డీవోలు రవికుమార్, ఇందిర మాట్లాడుతూ.. ఆధార్ సేవలపై సహాయకులు మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. అనంతరం డిజిటల్ సహాయకులు తమ సమస్యలను సీఈవో దృష్టికి తీసుకెళ్లగా, పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.





పద్మమ్మ మృతదేహం - తీవ్రంగా గాయపడ్డ చిన్నబ్బరెడ్డి



ధ్వంసమైన కారు

కావడి మొక్కుల యాత్రలో కారు ప్రమాదం

బ్రిడ్జి నుంచి కిందకు బోల్తాపడ్డ కారు

ముగ్గురు మృతి, మరో ముగ్గురికి తీవ్రగాయాలు

గంగాధరనెల్లూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గుడికి వెళుతుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుల బంధువులు తెలిపిన వివరాల మేరకు.. గంగాధరనెల్లూరు మండలం వేపంజేరి పంచాయతీ గోవిందరెడ్డిపల్లెకు చెందిన మాజీ మండల వైసీపీ కన్వీనర్ సురేంద్రరెడ్డి భార్య చిట్టెమ్మ(49), కుమార్తె కీర్తి (30), మనవడు శాన్విక్‌రెడ్డి (1), తమ్ముడు చిన్నబ్బరెడ్డి అలియాస్ విశ్వనాథరెడ్డి(52), మరదలు రేఖ (42), వారింట్లో పనిమనిషి పద్మమ్మ (58)తో కలిసి మంగళవారం మధ్యాహ్నం తమిళనాడులోని తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి గుడికి కావడి చెల్లింపుల కోసం కారులో బయల్దేరారు. చిత్తూరు - తచ్చూరు రోడ్డులో తమిళనాడు రాష్ట్రం పళ్లిపట్టుకు సమీపంలోని కుమారరాజాపేట వద్దకొచ్చేసరికి గుంతను తప్పించబోయి అక్కడున్న బ్రిడ్జిని కారు ఢీకొంది. తర్వాత బ్రిడ్జి నుంచి కిందకు బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారులోని పద్మమ్మ అక్కడికక్కడే మృతి చెందారు. తీవ్రంగా గాయపడ్డవారిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో చిన్నబ్బరెడ్డి, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శాన్విక్‌రెడ్డి మరణించారు. చిట్టెమ్మ, కీర్తి, రేఖలకు కూడా తీవ్ర గాయాలవడంతో తమిళనాడులోని రాణిపేట సీఎంసీ ఆస్పత్రికి తరలించారు.



గాయపడ్డ చిట్టెమ్మ, కీర్తి

గోవిందరెడ్డిపల్లెలో విషాదఛాయలు

విషయం తెలియడంతో గోవిందరెడ్డిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి బుధవారం రాణిపేట సీఎంసీకి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించనున్నారని వైసీపీ నేతలు పేర్కొన్నారు. సుమారు రెండు నెలల కిందటే సురేంద్రరెడ్డి కుమారుడికి వివాహమైంది. ఇంతలోనే ఈ ప్రమాదం జరగడం స్థానికులను కలచివేసింది.

చిత్తూరులో నేడు 'హర్ ఘర్ తిరంగా'

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమం ఏడాదిపాటు జరుగుతోందని డీఆర్వో మోహన్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం 9.30 గంటలకు విద్య, పోలీసు, ఇతర ప్రభుత్వ జిల్లాశాఖల ఆధ్వర్యంలో చిత్తూరు నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. గాంధీ విగ్రహం వద్ద ర్యాలీ ప్రారంభమౌతుందన్నారు. ముందుగా విద్యార్థులతో గాంధీవిగ్రహం వద్ద మానవహారం నిర్వహించి, తర్వాత జాతీయ జెండాలతో ర్యాలీ ప్రారంభిస్తారని వివరించారు. ఈ ర్యాలీలో అన్ని జూనియర్ కళాశాలల విద్యార్థులు, ఏఎన్ఎంలు, ఇతర విద్యాసంస్థల నుంచి సుమారు వెయ్యి మంది పాల్గొననున్నట్లు తెలియజేశారు. అలాగే ముఖ్యఅతిథిగా కలెక్టర్ సుమిత్‌కుమార్, జేసీ విద్యాధరి, పలువురు జిల్లా అధికారులు పాల్గొంటారన్నారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా పాల్గొనాలని కోరారు.

'నీలం' టన్ను రూ.91 వేలు



వేలం నిర్వహిస్తున్న మండీ యజమానులు

బంగారుపాళ్యం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బంగారుపాళ్యం వ్యవసాయ మార్కెట్ యార్డుకు మంగళవారం రైతులు తరలించిన మేలైన నీలం రకం మామిడి టన్ను రూ.91వేల ధర పలికింది. సురేంద్రనాయుడు మండీకి ఉప్పరపల్లెకి చెందిన శ్రవణ్ తీసుకొచ్చిన మేలైన నీలం మామిడి ఏకంగా టన్ను రూ.91వేలు పలకడంతో రైతు హర్షం వ్యక్తం చేశారు. బెంగళూరుకు చెందిన వ్యాపారస్తులు పోటీపడ్డారు. అలాగే తవణంపల్లె మండలం బోనమందకు చెందిన సుబ్రహ్మణ్యం నాయుడు తెచ్చిన నీలం మామిడి టన్ను రూ.82వేలు పలికింది. ఇంకో వారంలో సీజన్ ముగుస్తుందని మండీ యజమానులు తెలిపారు.



వా(ప్రే)మ హస్తం

తిరుపతి ఆంధ్రజ్యోతి

ఎడమచేతి వాటం కలిగిన వారిని ఒకప్పుడు పుర్రచెయ్యోడు, లొడ్డోడు.. అని ఎగతాళి చేసేవారు. ఎడమచేతిని వాడడం ఏ రకంగానూ లోపం కాదు. అయినా ఇప్పటికీ కుటుంబాల్లో కూడా ఎంతో కొంత గాయపడే మాటలు విసురుతూనే ఉంటారు. బలవంతంగా కుడి చేతిని వాడాలని వేధిస్తుంటారు. ఆడా, మగా సమానం అన్నట్టే.. కుడి, ఎడమల్లోనూ తేడా లేదు. ఒకటి బలమైనది, మరొకటి బలహీనమైనది కానేకాదు. ఏది ఎక్కువగా వాడితే అది ఆ పనులకు అలవాటవుతుంది అంతే. ప్రపంచంలో ప్రతి 10 మందిలో ఒకరు ఎడమ చేతివాటం వారని అంచనా. ఎడమచేతి వివక్షను సమాజంలో పోగొట్టాలనే ఉద్దేశంతో నేడు లెఫ్ట్‌హ్యాండర్స్‌డే జరుపుకుంటున్నారు.

లెఫ్ట్ హ్యాండర్స్ అనుకూలతలు

- బ్రెయిన్ స్ట్రోక్ వచ్చిన వారిలో కుడిచేతి వారికంటే త్వరగా ఎడమచేతివారు కోలుకుంటారు.
- క్రీడాకారులకు ప్రయోజనం ఎక్కువ
- టైపింగ్‌లోనూ వేగం, ● మెదడులోని ఎడమ, కుడి భాగాలతో మెరుగైన అనుసంధానం
- పార్కిన్‌సన్స్ వ్యాధి వచ్చే అవకాశాలు తక్కువ.
- నీటిలోపల చూసే సామర్థ్యం ఎక్కువ.



సర్జరీల్లోనూ సమస్య లేదు

చిన్నతనం నుంచి నాకు ఎడమ చేతివాటమే. ఎక్కడా ఇబ్బంది రాలేదు. యాదృచ్ఛికమే అయినా నా భర్త డాక్టర్ హరిబాబుది కూడా ఎడమ చేతివాటమే. ఆయన చిత్తూరు అపోలో హాస్పిటల్‌లో ఆర్థోపెడిక్ సర్జన్‌గా పనిచేస్తున్నారు. సర్జరీల్లో మాకు ఎప్పుడూ ఏ సమస్యా రాలేదు. ఏ తేడా అనిపించలేదు.

- డాక్టర్ పద్మజ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి




ఎడమచేతిని అడ్డుకోవద్దు

కుడి చేత్తో రాయడంవల్ల మెదడులోని ఎడమ అర్థగోళం (భాష, లాజిక్ పనిచేసే ప్రదేశం) పని చేస్తుంది. ఎడమ చేత్తో రాయడం వల్ల కుడి అర్థగోళం (సృజనాత్మకత, స్పేస్ అవగాహన గల ప్రదేశం) పని చేస్తుంది. అదే రెండింటినీ ఉపయోగించడం వల్ల కార్పస్ కాలాసమ్ (రెండు అర్థగోళాలను కలిపే సేతు) బలపడుతుంది. చేతుల కదలికలను నియంత్రించే మెదడు భాగం కొత్త కదలికలను నేర్చుకుంటుంది. ఈకొత్త న్యూరల్ కనెక్షన్లు కొత్త పనికి అలవాటు పడే క్రమంలో కొత్త విషయాలను వేగంగా నేర్చుకునే సామర్థ్యం పెరుగుతుంది. రెండు చేతుల సమన్వయం మెరుగవుతుంది. టైపింగ్, సంగీత వాయిద్యాలు వాయించడం, ఆటల్లో చురుకుదనం, వేగం పెరుగుతాయి. పిల్లలు ఎడమ చేయి వాడుతుంటే అడ్డుకోవద్దు. వీలైతే రెండు చేతులూ వాడేలా ప్రోత్సహించండి.

- భాస్కర రాజు, మేక్‌మైబేబీ జీనియస్ స్కూల్ వ్యవస్థాపకుడు

సవ్యసాచి అశ్విని

కుడి, ఎడమ తేడా లేదని నిరూపిస్తున్నారు సంగరాజు అశ్విని. రెండు చేతులతోనూ ఆమె ఒకే వేగంతో రాయగలరు. ఇంకా విశేషం ఏమిటంటే ఒకేసారి కుడిచేత్తో ఒక భాష, ఎడమ చేత్తో మరో భాషలో రాయడం. అక్షరాల అందంలోనూ కుడిచేతికీ, ఎడమ చేతికీ తేడా ఉండదు. ప్రస్తుతం తిరుపతిలోని మేక్‌మైబేబీ జీనియస్ స్కూల్ డైరెక్టర్‌గా ఉన్న అశ్విని..ఎడమచేతిని వాడే తమ విద్యార్థుల్లో న్యూనతను పోగొట్టడానికి తాను రాసి చూపిస్తుంటారు.



టీటీడీ విరాళంగా బ్యాటరీ బుగ్గీలు



టీటీడీకి మంగళవారం రెండు బ్యాటరీ బుగ్గీలు విరాళంగా అందాయి. బెంగుళూరుకు చెందిన చంద్రశేఖర్ అనే భక్తుడు రూ.11 లక్షలు విలువైన ఈ బ్యాటరీ వాహనాలను అందజేశారు. ఆలయం ముందు పూజలు చేసి, వాహనాల తాళాలను ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథంకు అందజేశారు.
- తిరుమల, ఆంధ్రజ్యోతి

15నుంచి ఆడికృత్తిక ప్రత్యేక బస్సులు

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ఆడికృత్తిక పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుత్తణికి ఆర్టీసీ మూడు రోజుల పాటు ప్రత్యేక బస్సులు నడపనుంది. జిల్లా నలుమూలల నుంచి ప్రయాణికులను 222(15న 65, 16న 88, 17న 69)బస్సులతో తిరుత్తణికి, అక్కడి నుంచి తిరుగు ప్రయాణంలో గమ్యస్థానాలకు చేరవేయనుంది.● తిరుపతి-తిరుత్తణి వయా నగరి - శుక్రవారం 4, శనివారం 5, ఆదివారం 5 ● అదేవిధంగా పచ్చికాపల్లం-తిరుత్తణి వయా నగరి 10, 20, 10 ● పుత్తూరు-తిరుత్తణి వయా పల్లిపట్టు 4, 6, 4 ● పుత్తూరు-తిరుత్తణి వయా నగరి 12, 12, 12 ● నగరి-తిరుత్తణి 5, 5, 5 ● కొత్తపల్లిమిట్ట-తిరుత్తణి వయా నగరి 10, 15, 15 ● సత్యవేడు-తిరుత్తణి వయా నాగలాపురం 10, 15, 10 ● నాగలాపురం-తిరుత్తణి 5, 5, 5 ● తిరుపతి-పాకాల - శుక్రవారం 5, శనివారం 5, ఆదివారం 3 చొప్పున బస్సులు నడుస్తాయి.

సర్వదర్శనానికి 12 గంటలు




తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 4 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.84 కోట్లు
సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 75,740
తలనీలాలు సమర్పించినవారు: 34,958

ప్రాణాలను నిలబెడదాం

రాజంపేటకు చెందిన 15ఏళ్ల స్పందనకు గుండె మార్పిడి చేయకపోతే ప్రాణాలకు ముప్పు వస్తుందని వైద్యులు తెలిపారు. కూలీ పనులు చేసుకునే ఆమె తల్లిదండ్రులు తిరుపతిలోని పద్మావతి చిన్నపిల్లల హృదయాలయను ఆశ్రయించారు. వైద్యులు వెంటనే బాలిక వివరాలను జీవన్‌ధాన్ పోర్టల్‌లో నమోదు చేశారు. నెలరోజుల తర్వాత గుంటూరుకు చెందిన ప్రసాద్(40) అనే వ్యక్తి రోడ్డు ప్రమాదంలో గాయపడి బ్రెయిన్ డెడ్ అయ్యాడు. అతని గుండెను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. హృదయాలయ వైద్యులు గుంటూరు వెళ్లి ప్రసాద్ గుండెను ఆగమేఘాలపై సేకరించారు. స్పందనకు అమర్చారు. ఇప్పుడు ఆ బాలిక చదువు కొనసాగిస్తోంది.



పూతలపట్టు మండలం సామనత్తంకు చెందిన బీటెక్ విద్యార్థి గొల్లపల్లి హేమకుమార్(24) రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించారు. అతని తల్లిదండ్రులు తమ బిడ్డ అవయవాలను దానం చేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో వైద్యులు గుండెను పద్మావతి హృదయాలయానికి తరలించి 29 ఏళ్ల వ్యక్తికి అమర్చారు. గంగవరం మహిళకు కాలేయం, పూతలపట్టు మహిళకు కిడ్నీని అమర్చారు. ఒక వ్యక్తి అవయవాలు ముగ్గురి ప్రాణాలను నిలబెట్టింది.

తిరుపతి(వైద్యం), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మరణించినా మరొకరిలో జీవించి ఉండాలంటే అవయవదానమొక్కటే మార్గం. పెద్ద మనసుతో స్పందిస్తే మరికొంతమంది ప్రాణాలను నిలపవచ్చు. అయితే అవయవదానంపై చాలామందికి సరైన అవగాహన లేదు. పైగా సెంటిమెంట్లు, అపోహలు తోడవుతున్నాయి. ఫలితంగా మరొకరి ప్రాణాలు నిలబెట్టే అవయవాలు మట్టిలో కలిసి పోతున్నాయి. ఒకప్పుడు ప్రధాన అవయవాలు చెడిపోతే మరణం తప్ప గత్యంతరంలేదు. ఇప్పుడు వైద్యరంగంలో వచ్చిన అధునాతన మార్పులతో అవయవాల మార్పిడి ద్వారా ఎందరో ప్రాణాలను నిలబెడుతున్నారు. ఎదురవుతున్న చిక్కల్లా ఎక్కువ మంది దాతలు ముందుకు రాకపోవడమే. వెంటాడుతున్న అవగాహనారాహిత్యమే.



గుంటూరులో దాత నుంచి సేకరించిన గుండెను పద్మావతి చిన్నపిల్లల హృదయాలయానికి తీసుకువస్తున్న వైద్యుడు

world organ donation day

అవయవదానంతో మరికొందరికి పునర్జన్మ

నేడు అవయవదాన దినోత్సవం

అవరోధంగా మారుతున్న అవగాహనారాహిత్యం

జీవన్‌దాన్ పోర్టల్‌లో వివరాలు నమోదు

బ్రెయిన్ డెత్, లేదా ఇతర కేసుల్లో అవయవాలను దానం చేసేందుకు దాతలు ముందుకు వస్తే గ్రహీతలకు అందించేందుకు ప్రభుత్వం జీవన్‌ధాన్ పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. గుండె, లివరు, కిడ్నీ వంటి ప్రధాన అవయవాలు పాడైన వారి వివరాలను ఇందులో నమోదు చేసుకుంటున్నారు. దాత దొరికితే జీవన్‌ధాన్ పోర్టల్లో బాధితులకు సమాచారమిస్తున్నారు. వెంటనే ఆ అవయవాలను మార్చి బాధితుల ప్రాణాలు నిలబెడుతున్నారు. పోర్టల్‌లో ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి మాత్రమే మొదట అవకాశం కల్పిస్తుండటం, మిగిలిన వారికి దాతలు దొరికే వరకు ఏమీ చేయలేని పరిస్థితిలో ఉండటంతో అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ప్రతి పది నిముషాలకు ఒకరు పోర్టల్ జాబితో చేరుతుండగా, నమోదు చేసుకున్న వారిలో రోజుకు 20 మందికి పైగా ప్రాణాలు విడుస్తున్నట్లు సమాచారం. పది శాతం మందిని మాత్రమే అవయవ మార్పిడితో రక్షించగలుగుతున్నారు.అవయవదానంపై అవగాహన లోపం కారణంగానే ఇలాంటి పరిస్థితి దాపురిస్తోంది.

మన జిల్లాలో ఇలా..

- తిరుపతిలోని టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ ఆస్పత్రిలో ఇప్పటి వరకు 20 గుండె మార్పిడి శస్త్ర చికిత్సలు జరిగాయి. వీరిలో మూడు నెలల చిన్నారుల నుంచి 55 ఏళ్ల వయసున్న వారు కూడా ఉన్నారు.
- ఏడాది కిందట స్విమ్స్‌లో బ్రెయిన్ డెడ్‌కు గురైన వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలతో ముగ్గురి ప్రాణాలు నిలబెట్టారు.
- కుటుంబ సభ్యులతో అనుమతితో మృతుల కళ్లను రుయాస్పత్రి ఐ-బ్యాంక్ సేకరిస్తోంది. మరణానంతరం కళ్లు దానం చేసేందుకు ముందుకు వచ్చే వారి వివరాలను కూడా నమోదు చేసుకుంటున్నారు. సేకరించిన కళ్లను అవసరమైన వారికి అమర్చి వెలుగులు నింపుతున్నారు.

వీరి అవయవాలు దానం చేయవచ్చు

వివిధ సంఘటనల్లో బ్రెయిన్ డెడ్‌కు గురైన వారి అవయవాలన్నీ ఇతరులకు ఉపయోగపడతాయి. వైద్యుల పర్యవేక్షణలో మరణించిన వారివి కూడా కొన్ని అవయవాలు ఉపయోగపడతాయి. జీవించి ఉన్న వారు కిడ్నీ, కాలేయం వంటి అవయవాలను ఇవ్వవచ్చు. ఒకరి నుంచి సేకరించిన గుండె, కిడ్నీ, లివర్, కళ్లు, ఊపిరితిత్తులు, చిన్నపేగులతో ఎనిమిది మందికి పునర్జన్మ కలుగుతుంది. తీవ్రమైన అంటు వ్యాధులు, క్యాన్సర్, డయాబెటిక్‌తో అధికంగా బాధపడే వారి అవయవాలు పనికిరావు.



అవగాహన పెరగాలి

మరణించాక శరీరంతోపాటు అవయవాలను మట్టిలో కలిసిపోనీయకుండా కుటుంబ సభ్యులు ముందుకు రావాలి. గుండె మార్పిడి కోసం అనేక మంది ఎదురు చూస్తున్నారు. బ్రెయిన్‌డెడ్‌కు గురైన వారి అవయవాలను ఇటువంటి వారికి దానం చేస్తే ప్రాణాలు నిలబెట్టవచ్చు. ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహనతో స్పందించాలి.

- డాక్టర్ శ్రీనాథ రెడ్డి, పద్మావతి చిన్నపిల్లల హృదయాలయ డైరెక్టర్

8మందికి పునర్జన్మ



బ్రెయిన్‌డెడ్ వ్యక్తి నుంచి సేకరించిన అవయవాలతో 8మంది ప్రాణాలను రక్షించవచ్చు. ఒకప్పుడు కిడ్నీ, లివర్ వంటివి మార్పిడీ చేసే అవకాశం ఉండేది. ప్రస్తుతం గుండెను సైతం మార్చుతున్నారు. కిడ్నీ, లివర్ వంటి అవయాలను దానం చేసేందుకు ఆరోగ్యవంతులైన వారు అర్హులు. ఒక కిడ్నీ, లివర్‌లో కొంత భాగం దానం చేశాక కూడా మామూలుగా బతకవచ్చు. అవయవదానానికి మించిన దానం మరొకటి లేదు.

- డాక్టర్ పీవీ రజనీకాంత్, లివర్ ట్రాన్స్‌ప్లాంటర్



బహుమతి పొందిన వాటిలో లావణ్యకుమార్, సాయికుమార్ తీసిన ఫొటోలు

'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్లకు అవార్డులు

తిరుపతి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ఫొటోగ్రఫీ డేని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ (ఏపీపీజేఏ) నిర్వహించిన జాతీయ ఫొటోగ్రఫీ పోటీల్లో తిరుపతి ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు ఆర్.లావణ్యకుమార్, కె.సాయికుమార్‌లకు బహుమతులు లభించాయి. స్పాట్‌న్యూస్ ఫొటో విభాగంలో లావణ్యకుమార్ తీసిన కాలువలో పేరుకుపోయిన ప్లాస్టిక్ చెత్తను తొలగిస్తున్న పారిశుధ్య కార్మికుల ఫొటోకు అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. జనరల్ విభాగంలో తిరుమల నడకదారిలో ఐసు తింటున్న ఉడుత ఫొటో తీసిన సాయికుమార్‌కు అచీవ్‌మెంట్ అవార్డు ప్రకటించారు. ఆగస్టు 19న విజయవాడలో జరగనున్న వేడుకలో వారు అవార్డులు అందుకోనున్నారు.

హెచ్‌డీపీటీ ఛైర్మన్‌గా దాసరి శ్రీనివాసులు



తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ (హెచ్‌డీపీటీ) ఛైర్మన్‌గా బీజేపీ నేత, తిరుపతికి చెందిన దాసరి శ్రీనివాసులును రాష్ట్ర ప్రభుత్వ నియమించింది. ఏపీలో 31 నామినేటెడ్ పదవులను భర్తీచేస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో మాజీ ఐఏఎస్ అధికారి అయిన దాసరి శ్రీనివాసులుకు ఈ పదవి దక్కింది. హిందూ ధర్మ పరిరక్షణార్థం మాజీ ఐఏఎస్ అధికారి పీవీఆర్కే ప్రసాద్ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖకు అనుబంధంగా హిందూ ధర్మ పరిరక్షణ ట్రస్ట్ ఏర్పాటు చేశారు. అంతటి ప్రతిష్ఠాత్మక ట్రస్ట్‌కు ఛైర్మన్‌గా నియమితులవడంపట్ల దాసరి శ్రీనివాసులు ఆనందం వ్యక్తం చేశారు.

మత్స్యకార సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా బొమ్మన శ్రీధర్



తడ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మత్స్యకార సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్‌గా తడ మండలానికి చెందిన మత్స్యకార నాయకుడు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మన శ్రీధర్‌ను ప్రభుత్వం నియమించింది. టీడీపీ ఆవిర్భావం నుంచి బొమ్మన కుటుంబం పార్టీలో కొనసాగుతోంది. శ్రీధర్ తండ్రి బొమ్మన సుందరయ్య మత్స్యకార గ్రామాల్లో టీడీపీ పటిష్ఠతకు ఎంతో కృషి చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్నో కేసులను ఎదుర్కొన్నారు.

షార్ డైరెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే

సూళ్లూరుపేట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): షార్ కొత్త డైరెక్టర్ ఈఎస్ పద్మకుమార్‌ను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. నియోజకవర్గ అభివృద్ధికి షార్ నుంచి పూర్తిస్థాయిలో సహకారం అందించాలని కోరారు. ఆమెతో పాటు నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, ఆకుతోట రమేష్, కొక్కు శంకరయ్య, మాధవనాయుడు, సెల్వం తదితరులున్నారు.

రుయాస్పత్రికి క్యాథ్ ల్యాబ్ మంజూరు

తిరుపతి(వైద్యం), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న గుండె సంబంధిత వ్యాధుల బాధితుల కోసం ప్రభుత్వం రుయాస్పత్రికి క్యాత్‌ల్యాబ్‌ను మంజూరు చేసింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రానున్న రోజుల్లో రుయాస్పత్రి మెరుగైన గుండె వైద్యాన్ని పీపీపీ(పబ్లిక్ ప్రవేటు పార్ట్నర్‌షిప్) పద్ధతిలో అందించనుంది.

సీఎం ప్రారంభించాకనే 'ఉచిత ప్రయాణం'

తిరుపతి(ఆర్టీసీ), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): మరో రెండు రోజుల్లో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమల్లోకి రానుంది. శుక్రవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. అలాగని, శుక్రవారం వేకువజామున ఫస్ట్ బస్సు నుంచే ఉచిత ప్రయాణం సాధ్యం కాదు. ఆ రోజు సీఎం చంద్రబాబు ఏ సమయానికి ప్రారంభిస్తారో.. అప్పటి నుంచే టిక్కెట్స్ జారీచేసే టిమ్స్‌కు గ్రీన్ సిగ్నల్ వస్తుంది. ఈ విషయాన్ని మహిళలు గుర్తు పెట్టుకోవాలని అధికారులు చెబుతున్నారు.

జీరో టికెట్ సిద్ధం

పుత్తూరు, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం కింద ఉచిత ప్రయాణానికి సంబంధించి జీరో టిక్కెట్ జారీకి టిమ్స్‌లలో ఇప్పటికే సాంకేతిక పరిజ్ఞానం పొందుపరిచారు. దీనిపై కండక్టర్లకు శిక్షణ ఇచ్చారు. పుత్తూరు డిపోలో 80 బస్సులు ఉండగా 55 బస్సుల్లో ఉచిత ప్రయాణానికి అనుమతించనున్నారు. డిపో సర్వీసుల్లో ప్రతి రోజు 3500 మంది మహిళలు ప్రయాణిస్తుండగా ఉచిత ప్రయాణంతో మరో 20 శాతం పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

గ్రామగ్రామాన కమల వికాసం

ప్రజాసమస్యల పరిష్కారానికి వారధిగా ఉండాలి ● సారథ్యం సభలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ పిలుపు



జ్యోతిప్రజ్వలన చేసి బీజేపీ విస్తృతస్థాయి సమావేశాన్ని ప్రారంభిస్తున్న మాధవ్

తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): గ్రామగ్రామాన కమల వికాసం జరిగేలా కృషి చేయాలని నేతలు, శ్రేణులకు బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్న ఆయన 'సారథ్యం' పేరిట జిల్లాల్లో పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ అధ్యక్షతన మంగళవారం తిరుపతిలో జరిగిన సారథ్యం కార్యక్రమానికి మాధవ్ హాజరయ్యారు. ప్రజాసమస్యల పరిష్కారానికి వారధులుగా ఉండాలని శ్రేణులకు సూచించారు. జిల్లాలో కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తుందన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచి, ఎంపీటీసీ, కౌన్సిలర్.. ఇలా ఏ అవకాశం వచ్చినా పోటీ చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. ఇకపై నామినేటెడ్ పోస్టులకూ సర్దుబాటు చేసుకుంటామని తెలిపారు. టీటీడీ ఉద్యోగుల్లోని అన్యమతస్థులను వేరే సంస్థలకు పంపించాలని డిమాండు చేశారు. అంతకుముందు బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కోలా ఆనంద్ మాట్లాడుతూ, కూటమి ఎమ్మెల్యేలు బీజేపీ నాయకులను పట్టించుకోవడం లేదన్నారు. ఎమ్మెల్యేల తీరుతో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఇకపై ఎక్కువ సమయం తిరుపతి లోక్‌సభ నియోజకవర్గంపై దృష్టి పెట్టాలని మాజీ ఎంపీ వరప్రసాద్‌ను కోలా ఆనంద్ కోరారు. నియోజకవర్గంలో తాను తిరిగినట్టు మరొక ఎంపీ, ఎంపీ అభ్యర్థి తిరగలేదని వరప్రసాద్ అన్నారు. అలాకాదని నిరూపిస్తే రాజకీయాల నుంచి విరమించుకుంటానని చెప్పారు. ఆయా కార్యక్రమాల్లో నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, జల్లి మధుసూదన్, పార్థసారధి, బీడీ బాలాజీ, చంద్రప్ప, శాంతారెడ్డి, చంద్రారెడ్డి, ఎస్‌ఎస్ నాయుడు, కండ్రిగ ఉమ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు లక్ష్మీపురం సర్కిల్లోని శంకరంబాడి సుందరాచారి విగ్రహానికి మాధవ్, నేతలు పుష్పాంజలి ఘటించారు. సారథ్యం కార్యక్రమంలో భాగంగా లీలామహల్ సర్కిల్ నుంచి కచ్చపి ఆడిటోరియం వరకు ర్యాలీ నిర్వహించారు. ఇక, ఉదయం 'చాయ్ పే చర్చ' కార్యక్రమంలో భాగంగా సామంచి శ్రీనివాస్‌తో కలిసి బైక్‌పై మాధవ్ తిరుపతిలో పర్యటించారు. బాబూ జగ్జీవన్‌రామ్ పార్క్ పరిసర ప్రాంతాల్లో పాదచారులతో మాట్లాడారు. నగరంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించి వివరాలు తెలుసుకున్నారు. సిటీ బస్సులు నడపాలని, యూడీఎస్ మెరుగు పరచాలని పలువురు ఆయనకు సూచించారు.

మేధావుల సదస్సు

కాగా, సోమవారం రాత్రి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాపారుల, మేధావుల సదస్సులో మాధవ్ పాల్గొన్నారు. పారిశ్రామిక అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయన్నారు. పారిశ్రామికవేత్తలకు కేంద్రం రాయితీలు ఇస్తోందని, అందరూ ముందుకు వచ్చి రాష్ట్రంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని కోరారు. పారిశ్రామికవేత్త పృథ్వీరెడ్డి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్, హోటల్ అసోసియేషన్, ఆటోమొబైల్ అసోసియేషన్, క్రెడాయ్ ప్రతినిధులు, బిల్డర్లు, విద్యావేత్తలు పాల్గొన్నారు.

మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్‌గా త్యాగరాజన్



చిత్తూరు సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మొదలియార్ సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా చిత్తూరుకు చెందిన సీఎస్ త్యాగరాజన్ నియమితులయ్యారు.టీడీపీ ఆవిర్భావం నుంచి పార్టీలో వున్న త్యాగరాజన్ గతంలో జిల్లా వాణిజ్య విభాగ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం టీడీపీ మొదలియార్ సంఘం అధ్యక్షుడిగా వున్నారు.ఈ సందర్భంగా దొడ్డిపల్లిలో త్యాగరాజన్‌ను పార్టీ నేతలు, కార్యకర్తలు సన్మానించారు. ఎమ్మెల్యే జగన్మోహన్ , పార్టీ అధ్యక్షుడు సీఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చుడా ఛైర్‌పర్సన్ కటారి హేమలత, టీడీపీ నేతలు ఉదయ్‌కుమార్, తిరుకుమరన్, నిత్య, గోపి, కృష్ణ కోటి, నాగరాజన్, తదితరులు త్యాగరాజన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

వైభవంగా సంకటహర గణపతి వ్రతం

స్వర్ణరథంపై విహరించిన వరసిద్ధుడు



స్వర్ణ రథోత్సవంలో పాల్గొన్న ఈవో, ఏఎస్పీ తదితరులు

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో మంగళవారం సంకటహర గణపతి వ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం మూల విరాట్‌కు అభిషేకం చేసి.. సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధుడిని ఉత్సవర్లను ఆలయ ఆస్థాన మండపానికి ఈవో పెంచలకిషోర్, సిబ్బంది భక్తిశ్రద్ధలతో తీసుకొచ్చారు. అక్కడున్న వేదికపై ఉత్సవర్లను కొలువు దీర్చారు. అనంతరం భక్తుల ఆధ్వర్యంలో సంకటహర గణపతి వ్రతాన్ని నిర్వహించారు. రాత్రి ఉత్సవర్లను స్వర్ణరథంపై ఉంచి ఆలయ మాడవీధుల్లో ఊరేగించారు. స్వర్ణరథంపై స్వామిని దర్శించుకోవడానికి వందలాదిగా భక్తులు కాణిపాకం తరలివచ్చారు. ఎమ్మెల్యే మురళీమోహన్, జడ్పీటీసీ సుచిత్ర, ఈవో పెంచలకిషోర్, ఏఎస్పీ రాజశేఖర్ రాజు, డీఎస్పీ సాయినాథ్, ఏఈవో రవీంద్ర బాబు, సూపరింటెండెంట్లు కోదండపాణి, వాసు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీ నాయుడు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఏనుగుల దినోత్సవం



కుంకీ ఏనుగులతో కళాశాల విద్యార్థులు

పలమనేరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పలమనేరు సమీపంలోని మొసలిమడుగు ఎలిఫెంట్ క్యాంప్ వద్ద మంగళవారం అటవీశాఖ అధికారులు ఏనుగుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎలిఫెంట్ క్యాంపులోని కుంకీ ఏనుగులకు స్నానాలు చేయించి పూలతో అలంకరించారు. అనంతరం పలమనేరు రేంజర్ నారాయణ, మున్సిపల్ కమిషనర్ ఎన్వీ రమణారెడ్డి కుంకీ ఏనుగులకు పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్ ఓ ప్రైవేటు కళాశాల విద్యార్థులకు ఏనుగుల దినోత్సవం, కుంకీ ఏనుగుల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో పలమనేరు అటవీశాఖ సిబ్బంది, రైతు సంఘ జిల్లా నాయకుడు ఉమాపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ గేమ్స్ సెక్రటరీ నియామకానికి దరఖాస్తు స్వీకరణ గడువు పొడిగింపు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు 2025-26, 2026-27 వరకు స్కూల్ గేమ్స్ సెక్రటరీ నియామకానికి దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగించినట్లు డీఈవో వరలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల 50 ఏళ్లలోపున్న ఎస్‌ఏ (ఫిజికల్ ఎడ్యుకేషన్) / పీఈటీల నుంచి దరఖాస్తులు ఆహ్వానించామన్నారు. ప్రస్తుతం గడువు ముగియడంతో ఈనెల 28వ తేదీ వరకు పొడిగించినట్లు ఆమె పేర్కొన్నారు. అర్హులు తమ దరఖాస్తులను డీఈవో కార్యాలయానికి అందజేయాలని సూచించారు.

తొమ్మిది మండలాల్లో తేలికపాటి వర్షం

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా గడిచిన 24 గంటల్లో తొమ్మిది మండలాల్లో తేలికపాటి వర్షం కురిసింది. మండలాలవారీగా.. శ్రీరంగరాజపురంలో 10.4, రొంపిచెర్లలో 8.6, పెనుమూరులో 5.4, కార్వేటినగరంలో 4.2, పులిచెర్లలో 4, నింద్రలో 3.2, సదుంలో 2.6, పాలసముద్రంలో 1.2, వెదురుకుప్పంలో 0.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

క్వారీల్లో తనిఖీలు



తిరుమలరాజుపురంలో క్వారీని పరిశీలిస్తున్న మైనింగ్, రెవెన్యూ అధికారులు

పాలసముద్రం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మండలంలోని తమిళనాడుకు సరిహద్దులో ఉన్న తిరుమలరాజుపురం, నరసింహాపురం పంచాయతీల్లో గ్రానైట్, గ్రావెల్ క్వారీలను మంగళవారం మైనింగ్, రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీ చేశారు. తహసీల్దార్ అరుణకుమారి, ఎస్‌ఐ చిన్నరెడ్డెప్పతో కలసి కడప జిల్లాకు చెందిన మైనింగ్ శాఖ అధికారులు క్వారీలను పరిశీలించారు. ఈ రెండు పంచాయతీల్లో ఏ మేరకు గ్రావెల్, గ్రానైట్ తరలించారన్న దానిపై నివేదికలను త్వరలో కలెక్టర్‌కు అందించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ రుషీవర్మ, వీఆర్వోలు రమేష్‌నాయుడు, రమణయ్య, సర్వేయర్ మధు తదితరులు పాల్గొన్నారు.

ఈతకెళ్లి విద్యార్థి మృతి



భార్గవ్(ఫైల్‌ఫొటో)

వి.కోట, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): చెరువులో ఈతకెళ్లి ఆరో తరగతి విద్యార్థి మృతిచెందిన సంఘటన వి.కోట మండలంలో మంగళవారం జరిగింది. వివరాలిలా.. వి.కోట మండలం యాలకల్లు గ్రామానికి చెందిన నాగరాజు, కల్పన దంపతుల కుమారుడు భార్గవ్ (11) వి.కోట పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం పాఠశాల నుంచి బస్సు దిగగానే స్కూల్ యూనిఫాంతోనే చెరువు వద్దకు చేరుకుని చెరువు వద్దకు వెళ్లాడు. గుర్తించిన కొందరు నీటిలో దిగకుండా కేకలు వేయడంతో ఇంటికి వెళ్లాడు. మళ్లీ తిరిగి వెళ్లి చెరువులో ఈత కొట్టేందుకు వెళ్లాడు. ఎంత సేపటికి తిరిగి రాకపోవడంతో బాలుడి అమ్మమ్మ చెరువు వద్దకు చేరుకుని బాలుడు చెరువు వద్ద నీటి కుంటలో మునిగి ఉండటం గుర్తించి బయటకు తీసింది. అప్పటికే బాలుడు నీటిలో ఊపిరాడక అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

పాత్రధారి సరే సూత్రధారులెవరు?

ఎర్రచందనం స్టాక్ పాయింట్‌పై అసలు దోషులను గుర్తిస్తారా?

పలమనేరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి) : బైరెడ్డిపల్లె మండలంలో ఎర్రచందనం స్టాక్ పాయింట్‌ను గుర్తించిన అధికారులు దాని వెనకున్న సూత్రధారులను కూడా గుర్తిస్తారా అన్నది పలమనేరు నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఆలప్పల్లి కొత్తూరుకు చెందిన భాస్కరరెడ్డి అనే వ్యక్తి ఇంట్లో పట్టుబడిన ఎర్రచందనం దుంగలను మంగళవారం అటవీ శాఖ అధికారులు పలమనేరు అటవీశాఖ కార్యాలయంలో తూకం వేయించగా 144 దుంగల బరువు 2436 కిలోలుగా తేలింది. తల్లిదండ్రులతో గొడవ పడి కొన్నేళ్లక్రితం ఆలప్పల్లి కొత్తూరుకు దూరంగా పొలం వద్దే ఇల్లు కట్టుకుని భాస్కరరెడ్డి కాపురముంటున్నాడు. కొద్దినెలల క్రితం గొడవపడడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది.10 రోజులకోసారి మాత్రమే ఇంటి వద్ద కనిపించే భాస్కర రెడ్డి హిటాచీ డ్రైవర్ పనికోసం కర్ణాటకకు వెళ్లొస్తుంటాడని గ్రామస్తులు చెబుతున్నారు.భాస్కర రెడ్డి గతంలో వైసీపీ నాయకులతో సన్నిహితంగా తిరిగే వాడని చెబుతున్నారు. అటవీశాఖాధికారులు అతడి ఇంట్లో ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నప్పుడు ఇంటి వద్ద ఎవరూ లేరు. భాస్కర రెడ్డికి ఎర్రచందనం దుంగలను సుదూర ప్రాంతాలకు తరలించి సొమ్ముచేసుకొనేంత సీన్ లేదని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.ఈ నేపథ్యంలో ఎర్రచందనం డంపింగ్‌లో అసలు సూత్రధారులను అధికారులు గుర్తించాల్సివుంది. భాస్కర రెడ్డి ఇల్లు కర్ణాటక సరిహద్దుకు కేవలం రెండుకిలోమీటర్ల దూరంలో ఉన్నందున స్మగ్లర్లు అతడి ఇంటిని డంపింగ్‌కు వాడుకొని వుండవచ్చని భావిస్తున్నారు. భాస్కర రెడ్డి ఇంటినుంచి జల్లపల్లి, కగ్గనహళ్లి, కొత్తపల్లి, చాట ఇండ్లు, గడ్డూరు (కర్ణాటక గ్రామాలు) మీదుగా ఉన్న గ్రామీణ రహదారి వెంబడి వెళితే బెంగళూరు-చెన్నై జాతీయ రహదారిలో ఆంధ్ర సరిహద్దులోని టోల్‌గేట్‌ను తప్పించి కర్ణాటక లోని ముళబాగల్ నియోజకవర్గ కేంద్రానికి 10 కిలో మీటర్ల దూరంలో జాతీయరహదారిని కలవవచ్చు. దీంతో గుట్టు చప్పుడు కాకుండా ఎర్రచందనం దుంగలను సులభంగా కర్ణాటకకు తరలించవచ్చు. బైరెడ్డిపల్లి మండలంలో మూర్ఛవ్యాధికి మందు ఇచ్చే విరూపాక్షపురం సమీపంలోని నెల్లిపట్ల మీదుగా కూడా తమిళనాడుకు వెళ్లే అటవీ మార్గం వుంది.దీంతో రాత్రివేళల్లో ఎర్రచందనం దుంగలను అటు కర్ణాటకకు గానీ తమిళనాడులోని పేర్నంబట్టు మీదుగా గుడియాత్తం, వేలూరు మీదుగా అక్కడి జాతీయ రహదారి పైనే చెన్నైకి తరలించవచ్చు.పరారీలో వున్న భాస్కర్ రెడ్డి దొరికితే ఎర్రచందనం దుంగల కేసు కొలిక్కి వచ్చే అవకాశం వుందని అధికారులు చెబుతున్నారు.



ఎర్రచందనం దొరికిన భాస్కరరెడ్డి ఇల్లు

ఆరోగ్య సమాజం నిర్మాణంలో పీఈఎస్ భాగస్వామ్యం

● కుప్పం మున్సిపాలిటీకి 500 వాణిజ్య చెత్త కుండీల వితరణ



పీఈఎస్ వితరణ చేసిన చెత్త కుండీలతో ఎమ్మెల్సీ కంచర్ల, పీఈఎస్ సంస్థ చైర్మన్ జవహర్ దొరస్వామి తదితరులు

కుప్పం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో ఆరోగ్య సమాజ నిర్మాణమనే బాధ్యతలో కుప్పంలోని పీఈఎస్ వైద్య విద్యాలయం, ఆస్పత్రులు భాగస్వాములయ్యాయి. కుప్పం పురపాలక సంఘానికి ఏకంగా 500 వాణిజ్యం చెత్త కుండీలు వితరణ చేశాయి. స్థానిక పీఈఎస్ వైద్య కళాశాల ఆడిటోరియంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఈ చెత్త కుండీలను పీఈఎస్ సంస్థల చైర్మన్ ప్రొఫెసర్ జవహర్ దొరస్వామి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ చేతుల మీదుగా మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ పీఈఎస్ వైద్య కళాశాలను కుప్పం ప్రజల జీవనాడిగా అభివర్ణించారు. గ్రామీణ ప్రజలకు అతి తక్కువ ఖర్చుతో నాణ్యమైన కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నారని ప్రశంసించారు. ఇలాంటి సంస్థలు సమాజ సేవలోనూ పాలు పంచుకుని రాష్ట్ర పురోగతికి చేస్తున్న కృషి ఎనలేనిదని పేర్కొన్నారు. పీఈఎస్ సంస్థల చైర్మన్ జవహర్ దొరస్వామి మాట్లాడుతూ తమ పీఈఎస్ సంస్థల లక్ష్యం కేవలం విద్యకే పరిమితం కాదన్నారు. ఆరోగ్యం, విద్య, పరిశుభ్రత వంటి సమాజానికి అవసరమైన అంశాలన్నింటిలో సేవ చేయడం నిరంతర బాధ్యతగా భావించి నిర్వర్తిస్తామని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం కింద రాబోయే ఆరు నెలల్లో కుప్పం రాష్ట్రంలోనే మొదటి వంద శాతం శుభ్రమైన మున్సిపాలిటీగా అవతరించబోతోందని ప్రకటించారు. కార్యక్రమంలో పీఈఎస్ సంస్థల సీవోవో ప్రొఫెసర్ అజయ్ కుమార్, పీఈఎస్ వైద్య కళాశాల డీన్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ హెచ్‌ఆర్.కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఆగని గజరాజుల దాడులు



ఏనుగులు తొక్కిన వరినారు



ఏనుగుల దాడిలో ధ్వంసమైన మామిడిచెట్టు

కల్లూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజరాజుల దాడులు ఆగడంలేదు. రోజూ రాత్రి వేళలో అటవీ సరిహద్దు ప్రాంతాల్లో ఏనుగుల గుంపు పంటలను ధ్వంసం చేస్తున్నాయి. దీంతో మామిడి, కొబ్బరి, వరి, అరటి, వంగ, టమోటా, మునగ, బెండ తదితర పంటలకు అపారనష్టం వాటిల్లుతోంది. సోమవారం రాత్రి తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని బోడబండ నుంచి బయలుదేరిన 16 ఏనుగుల గుంపు కమ్మపల్లి పంచాయతీ బాలిరెడ్డిగారిపల్లి వద్దకు చేరుకున్నాయి. గ్రామంలోని ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి చెందిన మామిడిచెట్లను ఏనుగుల గుంపు ధ్వంసం చేశాయి. మనోజ్‌కు చెందిన మామిడి, వరినారు, వేరుశనగ, పశుగ్రాసాన్ని ఏనుగులు ధ్వంసం చేశాయి. రామిరెడ్డికి చెందిన మిరప, వంగ, మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. దేశిరెడ్డిగారిపల్లిలోని రవీంద్రారెడ్డికి చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు అడవి వైపు అడుగులు వేశాయి. కమ్మపల్లిలోని ఎల్‌వీఎస్ నాయుడు డ్రాగన్ ఫ్రూట్ తోటలోకి చేరుకొని అక్కడి నుంచి అడవిలోకి వెళ్లాయి. మంగళవారం పగలంతా అడవిలోని చింతలవంక సమీపంలో 16 ఏనుగులు తిష్ట వేసినట్లు ఎఫ్‌బీవో మధు తెలిపారు.

అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ సర్వేయర్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ రవీంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు చేసుకునేవారు ఐదో తరగతి నుంచి ఆపై ఉన్నత చదువులు చదివి 18 ఏళ్లు పైబడిన వారు అర్హులన్నారు. పూర్తిచేసిన దరఖాస్తులను ప్రభుత్వ ఐటీఐలో సమర్పించాలన్నారు. ఇతర వివరాలకు 97047 62155 నెంబరును సంప్రదించాలని కోరారు.

ఆశా వర్కర్లకు ప్రభుత్వం తీపి కబురు

వెదురుకుప్పం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల విజ్ఞప్తి మేరకు వారి సంక్షేమం కోసం ప్రభుత్వం మూడు ముఖ్యమైన నిర్ణయాలను తీసుకుంది.

- **ప్రసూతి సెలవులు** : మొదటి, రెండో ప్రసవాల కోసం 180 (6నెలలు) రోజులు పూర్తి జీతంతో ప్రసూతి సెలవులు ఇస్తారు.
- **వయో పరిమితి** : ఆశా వర్కర్‌గా పనిచేయడానికి గరిష్ఠ వయసు 62 సంవత్సరాలుగా నిర్ణయించారు.
- **గ్రాట్యుటీ(సేవా విరమణ చెల్లింపు)** : సంవత్సరానికి నెల వారి గౌరవ వేతనం 50శాతం అంటే రూ.5వేలను చెల్లిస్తారు. గరిష్ఠంగా రూ.1,50,000 వరకు ఇస్తారు. ఇది రిటైర్మెంట్ తర్వాత ఆర్థిక భద్రత అందించడమే లక్ష్యంగా తీసుకున్న నిర్ణయం.

గోకులం షెడ్ల నిర్మాణంలో తప్పుడు ఎంట్రీలు నమోదు చేయొద్దు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గోకులం షెడ్ల నిర్మాణంలో తప్పుడు ఎంట్రీలు నమోదు చేయవద్దని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలు నుంచి డ్వామా పీడీ, ఏపీవో, ఏపీడీ, ఫీల్డ్ అసిస్టెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఇప్పటివరకు గోకులం షెడ్లకు సంబంధించి మండలాలవారీగా పూర్తయిన పనులు, బిల్లులు పరిస్థితి తదితరాలను ఆరా తీశారు. కాంట్రాక్టర్లకు సమస్యలుంటే వెంటనే పరిష్కరించి నిర్మాణ పనులు త్వరగా పూర్తిచేయాలని డ్వామా పీడీ రవికుమార్‌ను ఆదేశించారు. జరిగిన పనులు మాత్రమే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని స్పష్టం చేశారు.


గంజాయి అమ్మేచోటు తెలియదనడంతో వృద్ధుడిపై దాడి

బీరు బాటిల్‌తో కొట్టడంతో తీవ్రగాయాలు



గాయపడ్డ కుమారస్వామి

నగరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్మే చోటు తెలియదనడంతో ఓ వృద్ధుడిపై కొందరు యువకులు బీరు బాటిల్‌తో దాడి చేశారు. ఈ ఘటనలో వృద్ధుడు తీవ్రంగా గాయపడ్డాడు. సీఐ విక్రమ్ తెలిపిన వివరాల మేరకు.. గంజాయి అమ్మే చోటు ఎక్కడో చెప్పాలని నగరి మండలం ఓజీకుప్పం పరిధిలో జాతీయరహదారి వద్ద ఉన్న వంతెన సమీపంలో ఇంటికి వెళుతున్న కుమారస్వామి అనే వృద్ధుడిని కొందరు యువకులు అడిగారు. తనకు తెలియదని ఆయన చెప్పడంతో బీరు బాటిల్‌తో దాడి చేశారు. వృద్ధుడి తలపై కొట్టి, తీవ్రంగా గాయపరిచారు. విషయం తెలుసుకున్న పోలీసులు బాధితుడిని వెంటనే నగరి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ నిందితులే మరోచోట ఓ యువకుడి వద్ద నుంచి సెల్‌ఫోన్, రూ.400 లాక్కెళ్లినట్లు సీఐ తెలిపారు. రెండు ఘటనపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.





తాజాగా ఇచ్చిన కరెంటు బిల్లు - కొత్తగా అమర్చిన మీటరును పరిశీలిస్తున్న ఏఈఈ రామ్మూర్తి

ఆ ఇంటికి కరెంటు బిల్లు రూ.221 మాత్రమే

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వెదురుకుప్పం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆ ఇంటికి కరెంటు బిల్లు రూ.221 మాత్రమేనని కార్వేటినగరం విద్యుత్ శాఖ ఏఈఈ రామ్మూర్తి తేల్చారు. 'మూతపడిన ఇంటికి రూ.28,438 కరెంటు బిల్లు!' శీర్షికన ఆంధ్రజ్యోతిలో మంగళవారం కథనం ప్రచురితమైంది. స్పందించిన ఏఈఈ గ్రామానికి వెళ్లి ఇంటిని, మీటరును పరిశీలించారు. సాంకేతిక సమస్య కారణంగానే ఇంత కరెంటు బిల్లు వచ్చినట్లు గుర్తించారు. ఆ తర్వాత మీటరును మార్పించారు. జూలైలో వినియోగించిన విద్యుత్‌కు తాజాగా రూ.221 బిల్లును ఇచ్చారు. ఇందులో ఇప్పటికే మిగులుగా ఉన్న రూ.172 తగ్గించి రూ.49 మాత్రమే చెల్లించాలని సూచించారు.

ప్రశాంతంగా జడ్పీటీసీ ఉప ఎన్నికలు : టీడీపీ

చిత్తూరు సిటీ, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికలు ప్రజాస్వామ్యబద్ధంగా, ప్రశాంత వాతావరణంలో జరిగాయని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఉప ఎన్నికల సందర్భంగా ఓటర్లు స్వేచ్ఛగా, నిర్భయంగా పోలింగ్ కేంద్రాలకు వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారన్నారు. 30 ఏళ్ల తర్వాత పులివెందులలో ఓటర్లు ప్రజాస్వామ్య ఎన్నికలను చూశారని చెప్పారు. ఓటమి భయంతోనే వారంరోజులుగా మాజీ సీఎం జగన్, వైసీపీ నేతలు.. సీఎం చంద్రబాబు, రాష్ట్ర ఎన్నికల సంఘం, టీడీపీ నేతలు, పోలీసులపై తప్పుడు ఆరోపణలు, అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ ఎప్పుడూ ప్రజాస్వామ్యాన్ని, ప్రజా తీర్పును గౌరవిస్తుందని స్పష్టం చేశారు.

నృత్యాలు దేశభక్తిని చాటేలా ఉండాలి : డీఈవో

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య దినోత్సవానికి జిల్లాస్థాయిలో నిర్వహించే కార్యక్రమంలో విద్యార్థుల నృత్య ప్రదర్శనలు దేశభక్తిని చాటేలా ఉండాలని డీఈవో వరలక్ష్మి సూచించారు. ఈనెల 15వ తేదీన పోలీస్ పరేడ్ మైదానంలో నిర్వహించే సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యాశాఖ ద్వారా వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు నృత్య ప్రదర్శన చేయనున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం స్థానిక లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో డీఈవో ఆధ్వర్యంలో సెలక్షన్ కమిటీ ముందు నగరంలోని తొమ్మిది పాఠశాలల విద్యార్థులు నృత్యాలను ప్రదర్శించారు. ఏవి ప్రదర్శించాలన్న దానిపై సభ్యులు పరిశీలించి ఖరారు చేయనున్నారు. చిత్తూరు డీవైఈవో ఇందిర, ఎంఈవోలు సెల్వరాజ్, మోహన్, జీసీడీవో ఇంద్రాణి, హెచ్‌ఎంలు అరుణ్‌కుమార్, రాజేంద్ర పాల్గొన్నారు.

పిల్లల శారీరక ఎదుగుదలకు అడ్డంకిగా నులిపురుగులు

వైద్య ఆరోగ్యశాఖ జాయింట్ డైరెక్టర్



విద్యార్థితో ఆల్బెండజోల్ మాత్రను మింగిస్తున్న సునీల్ నాయక్

చిత్తూరు రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పిల్లల శారీరక ఎదుగుదలకు అడ్డంకిగా నులిపురుగులు మారుతున్నాయని వైద్య ఆరోగ్యశాఖ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ సునీల్ నాయక్ తెలిపారు. మంగళవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినాన్ని స్థానిక గిరింపేట మున్సిపల్ పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నులిపురుగులు లేని సమాజ స్థాపనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ హేమలత, అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ ప్రసంగించారు. డీఐవో హనుమంతరావు, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాత్రలను జాగ్రత్తగా మింగించండి

ఐరాల(కాణిపాకం): విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలను జాగ్రత్తగా మింగించాలని సునీల్ నాయక్ సూచించారు. మంగళవారం కాణిపాకం ఎంపీపీ పాఠశాలకు సందర్శించారు. పాఠశాలకు రాని విద్యార్థులను గుర్తించి వారికి ఈనెల 20వ తేదీన మాత్రలను అందజేయాలని చెప్పారు. హెచ్‌ఎం మోహన్, ఆరోగ్య విస్తరణాధికారి శివయ్య, టీచర్లు పాల్గొన్నారు.

3,51,648 మందికి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

● 97 శాతం పూర్తి: అడిషనల్ డీఎంహెచ్‌వో

చిత్తూరు రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అంగన్‌వాడీ, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, ఐటీఐ, పాలిటెక్నిక్, నర్సింగ్ కళాశాలలు, బడిబయట పిల్లలు మొత్తం 3,62,534 మంది ఉన్నారు. మంగళవారం ఒక్కరోజులోనే 3,51,648 మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్ తెలిపారు. మిగిలినవారికి బుధవారం మాత్రలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

డెత్ క్లెయిమ్‌ల పరిష్కారానికి చర్యలు

● పీఎఫ్ కమిషనర్ రవితేజ కుమార్ రెడ్డి

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): డెత్ క్లెయిమ్‌లను వేగంగా పరిష్కరించడానికి చర్యలు చేపడుతున్నట్లు కడప ప్రాంతీయ ప్రావిడెంట్ ఫండ్ (పీఎఫ్) కమిషనర్ రవితేజ కుమార్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈపీఎఫ్ సభ్యుడు చనిపోయి నెలలు, ఏళ్ల గడుస్తున్నా డెత్ క్లెయిమ్‌లు పరిష్కారం కాని కుటుంబీకులు ఆయా యాజమాన్యాల ద్వారా కడప, కర్నూలు, అనంతపురం, తిరుపతి, నెల్లూరు జిల్లా కార్యాలయాల్లో సంబంధిత ధ్రువపత్రాలను అందజేయాలని సూచించారు. ఈపీఎఫ్ సభ్యుడు యూనివర్సల్ అకౌంట్ నెంబరు(యూఏఎన్)కు ఈ-నామినేషన్ జతచేసి ఉంటే అతడి మరణాంతరం కుటుంబీకులు ఆన్‌లైన్‌లోనే డెత్ క్లెయిమ్ సమర్పించవచ్చన్నారు. కడప ప్రాంతీయ కార్యాలయ పరిధిలోని కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు, తిరుపతి జిల్లాల పరిధిలోని యాజమాన్యాలు, ఈపీఎఫ్ సభ్యులు, నామినీలు, డెత్ క్లెయిమ్‌లకు సంబంధించిన వివరాలను లేదా ఫిర్యాదులను 94911 38280 నెంబరుకు ఫోన్ ద్వారా లేదా వాట్సాప్ ద్వారా పంపవచ్చని వివరించారు. కడప ప్రాంతీయ పీఎఫ్ కార్యాలయ పరిధిలో ఈపీఎఫ్‌వో సభ్యులు, యాజమాన్యాలు, పెన్షనర్లకు మెరుగైన సేవలందించేందుకు జూలై నుంచి సెప్టెంబరు వరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కేసులు



ప్రభుత్వ భూమిలో నాటిన మొక్కలను తొలగిస్తున్న అధికారులు



బోర్డును ఏర్పాటు చేస్తున్న అధికారులు

చౌడేపల్లె, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ పార్వతి మంగళవారం హెచ్చరించారు. సోమవారం అమినిగుంట పంచాయతీకి చెందిన దామోదర్ కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు సింగిరిగుంట సమీపంలో కొందరు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుంటున్నారని, అక్రమ మైనింగ్ చేస్తున్నారని ఫిర్యాదు చేశారు. స్పందించిన కలెక్టర్ తహసీల్దార్ పార్వతిని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రెవెన్యూ సిబ్బంది పెద్దకొండామారి రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 922ఏ లో సుమారు 3 ఎకరాల ప్రభుత్వ భూమిని చౌడేపల్లెకు చెందిన షర్మిల ఆక్రమించిట్లు గుర్తించి సోమవారం అందులో నాటిన మామిడి మొక్కలను తొలగించారు. ప్రభుత్వ భూమి అని బోర్డును రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వీఆర్‌వో విజయకుమార్‌రెడ్డి, సర్వేయర్లు, వీఆర్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో లీలామాధవి

చౌడేపల్లె, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో లీలా మాధవి హెచ్చరించారు. మంగళవారం ఆమె స్థానిక హైస్కూల్‌లో విద్యార్థులకు అందించే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. నాణ్యత భోజనం, కూరలు వడ్డిస్తుండటంతో ఆమె మండిపడ్డారు. ఇకపై నాణ్యత లేకుంటే చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోప్ స్కిప్పింగ్‌లో సోమల విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులతో ప్రధానోపాధ్యాయులు

సోమల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలకు సోమల హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌.ఎం.హేమసుధాకర్ తెలిపారు. ఈనెల 10వ తేదీన మదనపల్లెలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని విద్యార్థుల ఎంపిక జరిగింది. ఈక్రమంలో సోమల ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థులు షేక్ మహమ్మద్ రియాజ్, రఘునందన్, షేక్ హుషఫ్ ప్రతిభ కనబరచి జిల్లా జట్టుకు ఎంపికైయ్యారు. ఈనెల 30న కర్నూల్‌లో రాష్ట్ర స్థాయి పోటీలు జరుగుతున్నట్లు పీడీ కరుణానిధి తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

వైభవంగా ఇరూపాక్షమ్మ జాతర

రొంపిచెర్ల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బొమ్మయ్యగారిపల్లె పంచాయతీ రాగాలవారిపల్లె గ్రామదేవత ఇరూపాక్షమ్మ జాతర మంగళవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని ఆలయాన్ని విద్యుత్ దీపాలు, పూలు, పచ్చని తోరణాలతో అలంకరించారు. అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు.

భీమగానిపల్లె సచివాలయంలో కనిపించని అధికారులు



భీమగానిపల్లె సచివాలయంలో సిబ్బంది లేక దర్శనమిస్తున్న ఖాళీ కుర్చీలు

పుంగనూరు రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామస్థాయిలోనే ప్రభుత్వ అధికారులు అందుబాటులో ఉంటూ ప్రజలకు ఇబ్బందిలేకుండా పనులు చేయాలని ఏర్పాటు చేసిన సచివాలయాల్లో అధికారులు లేక ప్రజలు ఎదురుచూసే పరిస్థితి నెలకొంది. సచివాలయ అధికారులు, సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ సమయపాలన పాటించడం లేదు. పుంగనూరు మండలం భీమగానిపల్లె సచివాలయంలో మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు అధికారులు లేక ఖాళీగా ఉన్న కుర్చీలు దర్శనమిచ్చాయి. ఉదయం 10.30 గంటలకు రావాల్సిన సిబ్బంది సమయపాలన పాటించకపోవడం, వచ్చిన సిబ్బంది ప్రజలను పట్టించుకోకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వసతిగృహ మెస్ చార్జీలు పెంచాలి



ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న రాష్ట్ర సమితి సభ్యులు

పుంగనూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పెరిగిన ధరలకు అనుగుణంగా హాస్టల్ మెస్ చార్జీలను పెంచాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమి తి సభ్యులు మున్నా డిమాండ్ చేశారు. మంగళవారం పుంగనూరు ప్రభు త్వ జూనియర్ కాలేజీ వద్ద ఏఐఎస్ఎఫ్ జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజీలు ప్రారంభించి మూడు నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు డిగ్రీ అడ్మిషన్లు చేయకపోవడం దారుణమన్నారు. విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆడుకుంటోందని మండిపడ్డారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘ నాయకులు సాయితేజ, వంశీ, బాలాజీ, గుణశేఖర్, ధనుంజయ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కిట్ల కొనుగోలుకు ఆర్థిక సాయం

పుంగనూరు రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ఎన్‌సీసీ విద్యార్థులకు కిట్లు కొనుగోలు చేయడానికి లయన్స్‌క్లబ్ ప్రతినిధి దాత డాక్టర్ శివ రూ.6 వేలు ఆర్థిక సహాయం చేసినట్లు ఎన్‌సీసీ అధికారి సోమరాజు తెలిపారు. మంగళవారం దాతను అధ్యాపకులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

మహిళ మెడలో గొలుసు దోపిడీ

గంగవరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో గుర్తు తెలియని దుండగులు సుమారు రూ.4 లక్షలు విలువైన బంగారు గొలుసును లాక్కెళ్లారు. బాధితురాలి కథనం మేరకు... గంగవరంలోని సాయిప్యాలెస్ వెనుక కాపురం ఉన్న శ్రావణి ఇంటి ముందు వెళ్తుండగా.. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి మాటలు కలిపారు. ఇంతలోనే ఆ ఇద్దరు ఆమెతోపాటు ఇంట్లోకి వెళ్లి తలుపులు మూసి అరిస్తే చంపేస్తామని బెదిరించారు. ఆమె మెడలో ఉన్న సుమారు రూ.4 లక్షలు విలువ చేసే 32 గ్రాముల బంగారు గొలుసును లాక్కొని పరుగులు తీశారు. ఇంతలోనే శ్రావణి కేకలు వేయడంతో సమీప ప్రజలు వచ్చేలోపు దొంగలు వెళ్లిపోయారు. బాధితురాలు మంగళవారం రాత్రి గంగవరం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

రజిత మృతి తీరని లోటు

పలమనేరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అనిశెట్టి రజిత ఆకస్మిక మరణం తెలుగు సాహిత్య లోకానికి తీరని లోటని పలువురు రచయితలు పేర్కొన్నారు. ప్రజాస్వామిక రచయితల జాతీయ వేదిక అధ్యక్షురాలు అనిశెట్టి రజిత సోమవారం రాత్రి వరంగల్‌లో గుండెపోటుతో మృతిచెందారు. పలమనేరు రచయితల సంఘం గౌరవ అధ్యక్షులు ఆర్. మాధవ్, కార్యదర్శులు డి. కుమారస్వామిరెడ్డి, జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి, తెలుగుసాహిత్యసాంస్కృతిక సమితి అధ్యక్ష, కార్యదర్శులు పి. తులసీనాథంనాయుడు, పుష్ప, గ్రంథాలయ అధికారి హేమకుమార్ తదితరులు అనిశెట్టి రజిత మరణంపై సంతాపం తెలిపారు.

17న బైరెడ్డిపల్లెలో మెగా వైద్యశిబిరం

బైరెడ్డిపల్లె, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె జడ్పీఉన్నత పాఠశాల ఆవరణలో ఈనెల 17న ఉదయం 9 గంటలకు మహతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సహకారంతో కుప్పం పీఈఎస్ ఆస్పత్రి వైద్యులచే ఉచిత మెగావైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

చౌడేపల్లె, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటూరుకు చెందిన బాషా, పాతవీరప్పల్లెకు చెందిన గురప్ప ద్విచక్రవాహనంలో రాజనాలబండలో స్వామి దర్శనానికి చౌడేపల్లె నుంచి వెళ్తుండగా రాజనాలబండ ఆర్చి సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి పడ్డారు. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడటంతో 108 వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

బంగారు తిరుత్తణి కొండపై ఆడికృత్తిక ఉత్సవాలు

సోమల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సోమల పట్టణం సమీపంలోని బంగారు తిరుత్తణి కొండపై కొలువుదీరిన వల్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్య స్వామి 41వ ఆడికృత్తిక ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. వినాయకస్వామి ఆలయం నుంచి కొండపై ఆలయం వరకు విద్యుత్ దీపాలంకరణలు చేపట్టారు.

సీతమ్మ చెరువుకట్ట పనులకు మోక్షం



ఆవులపల్లె సీతమ్మ చెరువును పరిశీలిస్తున్న ఎస్‌ఈ వెంకటేశులరాజు, అధికారులు

పుంగనూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఆవులపల్లె వద్దనున్న సీతమ్మ చెరువుకట్టను పునరుద్ధరించాలని రైతుల కోరిక మేరకు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాల మేరకు మంగళవారం జలవనరులశాఖ చిత్తూరు ఎస్‌ఈ కె.వెంకటేశులరాజు, ఇంజనీరింగ్ అధికారులు చెరువును పరిశీలించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పుంగనూరు మండలం నేతిగుట్లపల్లె, సోమల మండలం ఆవులపల్లె, అన్నమయ్య జిల్లా ముదివేడు రిజర్వాయర్ల నిర్మాణానికి రూ.2,144.50 కోట్ల అంచనాలతో ఒకే జీవో జీవోఆర్టీ 461 ప్రకారం మంజూరు చేశారు. గత పాలనలో వేగంగా నేతిగుట్లపల్లె, ముదివేడు పనులు జరగ్గా సోమల మండలం ఆవులపల్లె రిజర్వాయర్ నిర్మాణంతో పర్యావరణం దెబ్బతింటుందని, చెట్లు, పలు గ్రామాలు, వ్యవసాయ పొలాలు నీటమునిగి నష్టం జరుగుతుందని బాధితులు ఎన్జీటీ (నేషనల్ గ్రీన్ ట్రిబ్యూనల్)లో కేసు వేశారు. దీంతో ఒకే జీవోలు ఉన్న మూడు ప్రాజెక్టులు వెంటనే పనులు నిలిపేస్తూ రూ. 100 కోట్లు కృష్ణాబోర్డుకు భారీ జరిమానా చెల్లించాలని ఎన్జీటీ తీర్పు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై సుప్రీం కోర్టుకు వెళ్లగా ఎన్జీటీ రూ.100 కోట్ల జరిమానాకు స్టే ఇస్తూ రూ.25 కోట్లు కృష్ణా బోర్డుకు డిపాజిట్ చేయాలని ఆదేశించింది. తర్వాత కూటమి ప్రభుత్వం రావడంతో ఆవులపల్లె ప్రాజెక్టు బాధిత రైతులు పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డితో పాటు సీఎం చంద్రబాబును కలిశారు. అలాగే జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి స్వయంగా ఆవులపల్లె ప్రాజెక్టు ప్రాంతాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడి వారి కోరికను సీఎం దృష్టికి తీసుకెళ్లారు. సీఎం, మంత్రి ఆదేశాలతో జలవనరుల శాఖ అధికారుల బృందం ఆవులపల్లె ప్రాజెక్టు నిర్మాణ స్థలాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు.

కట్ట నిర్మాణానికి రూ.20 కోట్లతో ప్రతిపాదనలు: ఎస్‌ఈ

ఆవులపల్లె సీతమ్మచెరువు కట్టను గతంలో కాంట్రాక్టర్ ప్రాజెక్టు కోసం తొలగించారు. అయితే రైతులు తమకు ఇక్కడ ప్రాజెక్టు అవసరం లేదని, చెరువు కట్టలేక వ్యవసాయం చేసుకోవడానికి వీలు కావడంలేదన్నారు. గతంలో చెరువు కట్ట ఉన్న తరహాలో కట్ట నిర్మించాలని కోరారు. ఈ మేరకు ఇటీవల కట్ట నిర్మాణానికి దాదాపు రూ.20 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి తిరుపతి సీఈకి పంపామని ఎస్‌ఈ వెంకటేశులరాజు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ మదనపల్లె ఈఈ జి.సురేశ్, డీఈ బాబురాజేంద్రప్రసాద్, జేఈ శభరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో అన్ని ఖాళీలు భర్తీ చేయాలి



కుప్పం డిపో ఎదుట ధర్నా చేస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు



పలమనేరు డిపో ఎదుట ధర్నాలో పాల్గొన్న ఆర్టీసీ ఉద్యోగులు

కుప్పం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీలోని అన్ని ఖాళీలను భర్తీ చేయాలని, సంస్థలోని సిబ్బంది సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆర్టీసీ ఎన్‌ఎంయూఏ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండు చేశారు. ఆర్టీసీ ఆస్తుల పరిరక్షణ, రాష్ట్ర వ్యాప్తంగా సంస్థ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై కుప్పం డిపో ఎదుట మంగళవారం ఎన్‌ఎంయూఏ డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.మునస్వామి, ఈ.జయపాల్‌ల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి, తక్షణమే వేతన సవరణ చేయాలని, ఐఆర్ ప్రకటించాలని కోరారు. గవర్నర్ పేట్-1, పాత బస్టాండు స్థలాలను, షాపింగ్ మాల్స్‌ను ప్రైవేటు వ్యక్తులకు కేటాయిస్తూ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులు రద్దు చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంటు డిపో తరలింపును ఆపాలని, పెండింగులో ఉన్న 4 డీఏలను చెల్లించాలని, విశ్రాంత ఉద్యోగులకు పెండింగు బకాయిలు ఇవ్వాలని, నాలుగేళ్లుగా ఆగిపోయిన పదోన్నతులు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూఏ జోనల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జి.రహంతుల్లా, జిల్లా కమిటీ సభ్యుడు రెడ్డి కిశోర్, డిపోవర్కింగ్ ప్రెసిడెంట్ ఎంజీ.ప్రసాద్ కుమార్, డిపో సంయుక్త కార్యదర్శి జి.మునెప్ప, గ్యారేజ్ యూనియన్ నాయకులు కె.దిలీప్, వి.జయశంకర్, అరుణ్, నేము రాజు, ఉదయ్, బాలకృష్ణ, ఎంసీ.నాయక్, ఎన్ఆర్.రాజ, రఘుపతి, ప్రసన్న, శరవణ, గోవిందరాజు పాల్గొన్నారు.

- **పలమనేరు:** ఉద్యోగుల సమస్యలు పరిష్కారం కాకపోవడంతో తమకు నిరసనలు తప్పడం లేదని ఎన్జీవో సంఘం పలమనేరు తాలూక అధ్యక్షులు ఆనందబాబు పేర్కొన్నారు. మంగళవారం పలమనేరు ఆర్టీసీ డిపో కార్యాలయం ఎదుట ఆర్టీసీ ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తక్షణమే పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేసి రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న వేతన సవరణలను అమలు చేయాలన్నారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గణేష్, ఢిల్లీబాబు, హుసేన్, సీనియర్ నాయకులు కేవీరమణ, మోహన్, కేసీబాబు, ఎస్‌ఎం రత్నం, శ్రీనివాసులు, ఉమాపతి, రమణ, శ్రీనివాసులు, ఇంతియాజ్, పురుషోత్తం, నారాయణ, బాలు తదితరులు పాల్గొన్నారు.
- **పుంగనూరు:** ఆర్టీసీ ఉద్యోగుల బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఎన్ఎంయూ కార్యదర్శి రామకృష్ణ డిమాండు చేశారు. మంగళవారం స్థానిక ఆర్టీసీ డిపో ఎదుట ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ ఇవ్వాలని, ఆర్టీసీలో ఉన్న ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

అధికారులు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలి

- మండల సమావేశంలో ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి

కల్లూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రజలకు జవాబుదారీగా వ్యవహరించాలని ఎంపీపీ సురేంద్రనాథ రెడ్డి తెలిపారు. పులిచెర్ల మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పలువురు మండల స్థాయి అధికారులకు సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తెలియకపోవడం బాధాకరమన్నారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తేనే ప్రజా సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. ఎంపీడీవో రాజశేఖర్ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు చేపట్టాలన్నారు. ఎంఈవో శిద్ధరామయ్య మాట్లాడుతూ బడి బయట ఉన్న చిన్నారులను బడిలో చేర్పించడంలో ప్రజా ప్రతినిధులు చొరవ చూపాలని కోరారు. డాక్టర్ యల్లయ్య మాట్లాడుతూ అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఏపీవో సౌభ్యావతి మాట్లాడుతూ ఉపాధి పథకంలో పండ్ల మొక్కలు పెంపకంపై రైతులు దృష్టి సారించాలన్నారు. ఏపీఎం చంద్రమోహన్, అధికారులు, ప్రజా ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

మయూర వాహనంపై ఊరేగిన సుబ్రహ్మణ్యుడు



ఊరేగిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి

గుడుపల్లె, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మయూర వాహనంపై వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యుడు మంగవారం విహరించి భక్తులకు కనువిందు చేశారు. మండల పరిధిలోని గుడివంక కొండలో సుబ్రహ్మణ్యస్వామి ఆడికృతిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం స్వామి అమ్మవార్లకు ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా రుద్రాభిషేకం నిర్వహించి వివిధ రకాల పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు గానవి ఎంపిక



పుంగనూరు రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 25న ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్‌లో జరిగే జాతీయ ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు చంద్రమాకులపల్లె జడ్పీ హైస్కూల్ విద్యార్థిని గానవి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం వెంకటరమణ తెలిపారు. అన్నమయ్య జిల్లా పోతబోలు శ్రీవేద పాఠశాలలో ఈనెల 4, 5 తేదీల్లో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో గానవి ప్రతిభ కనబరిచినట్లు చెప్పారు. గానవిని హెచ్‌ఎం వెంకటరమణ, పీఈటీ మురళీధర్, ఉపాధ్యాయులు జ్యోతి, వెంకటరమణారెడ్డి, రమణమ్మ, మణి, శంకర్‌రెడ్డి, రఘు, సుజాత అభినందించారు.

నేడు సింగిల్ విండో త్రిసభ్య కమిటీ ప్రమాణ స్వీకారం



రమేష్

గుడుపల్లె, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గుడుపల్లె మండల సింగిల్ విండో త్రిసభ్య కమిటీ బుధవారం ప్రమాణ స్వీకారం ప్రమాణ స్వీకారం చేయనుంది. ఉదయం 10 గంటలకు గుడుపల్లె సింగిల్ విండో కార్యాలయ ఆవరణలో జరిగే కార్యక్రమంలో చైర్మన్‌గా కొడతనపల్లెకు చెందిన రమేష్, డైరెక్టర్లుగా వేపమానుకొత్తూరుకు చెందిన వెంకటేష్, సంగనపల్లెకు చెందిన కృష్ణప్పలు ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు మండల టీడీపీ అధ్యక్షులు బాబు నాయుడు తెలిపారు. మండలంలోని నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

మహిళ మెడలో బంగారు గొలుసు దోపిడీ

పుంగనూరు రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పట్టపగలే ఓ దుండగుడు ఇంటిలోకి చొరబడి ఓ మహిళ మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన మంగళవారం పుంగనూరులో జరిగింది. బాధితురాలి కథనం మేరకు.. స్థానిక కొత్తయిండ్లులోని సాయినగర్‌లో నివాసం ఉన్న మోహన్‌రెడ్డి భార్య సుశీలమ్మ ఇంట్లో పనులు చేస్తుండగా ఓ గుర్తు తెలియని దుండగుడు ప్రవేశించాడు. మీ భర్త ఏమి చేస్తున్నాడని అడగడంతో సుశీలమ్మ ఇంటి లోపల నుంచి రాగానే మెడలోని 30 గ్రాముల బంగారు చైన్ లాక్కెళ్లినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమె ఫిర్యాదు మేరకు సీఐ సుబ్బరాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళపై దాడి చేసిన వ్యక్తి అరెస్టు

పుంగనూరు రూరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మహిళపై దాడి చేసిన వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు మంగళవారం సీఐ సుబ్బరాయుడు తెలిపారు. పట్టణంలోని కొత్తయిండ్లుకు చెందిన రాణెమ్మపై ప్రియుడు వెంకటేశ్ గొంతుకోసి హత్యాయత్నానికి పాల్పడిన సంఘటన తెలిసిందే. ఈ కేసులోని నిందితుడు అరవాండ్లపల్లెకు చెందిన వెంకటేశ్‌ను మంగళవారం అరెస్టు చేసి మదనపల్లె కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి నిందితుడికి 14 రోజులు రిమాండు విధించినట్లు ఆయన చెప్పారు.

14 నుంచి ఆడికృత్తిక మహోత్సవాలు

సదుం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక గార్గేయ నది ఒడ్డుపై వెలసిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో గురువారం నుంచి వరుసగా మూడు రోజుల పాటు ఆడికృత్తిక మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. 14న ధ్వజారోహణ, 15న భరణి కావళ్లు, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దంపతులచే స్వామి వారికి పట్టువస్త్రాల సమర్పణ, 16న కృత్తిక కావళ్లు, స్వామి వారి కల్యాణోత్సవం, అన్నదానం, 17న ఆదివారం రాత్రి స్వామి వారి ఊరేగింపు నిర్వహించనున్నట్లు నిర్వాహక కమిటీ తెలిపింది.

మరింత సమర్థవంతంగా ఇంటింటి వ్యర్థాల సేకరణ

● 'ఐటీసీ'తో నగరపాలక సంస్థకు కుదిరిన ఎంవోయూ

చిత్తూరు అర్బన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఇంటింటి నుంచి వ్యర్థాల సేకరణ మరింత సమర్థవంతంగా చేయడానికి ఐటీసీ సంస్థతో చిత్తూరు నగరపాలక సంస్థ ఒప్పందం (ఎంవోయూ) కుదుర్చుకుంది. రాష్ట్రస్థాయిలో స్వర్ణాంధ్ర కార్పొరేషన్‌తో కుదిరిన ఒప్పందంలో భాగంగా మంగళవారం నగరపాలక కార్యాలయంలో ఐటీసీ సంస్థ డీజీఎం ఉమాకాంత్, ఏజీఎస్ గోపాలకృష్ణమూర్తితో సమావేశాన్ని నిర్వహించి, ఎంవోయూ కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ నరసింహ ప్రసాద్ మాట్లాడుతూ.. నగరపాలక సంస్థ పరిధిలో ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్త సేకరణలో స్వయం సహాయక సంఘాలతో కలిసి ఐటీసీ పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో లోకేష్, ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర, ఐటీసీ రాష్ట్ర కో-ఆర్డినేటర్ హేమ మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు హయాంలోనే రాష్ట్రాభివృద్ధి: టీడీపీ


కైపాకం పంచాయతీలో కరపత్రాలతో టీడీపీ నాయకులు

నింద్ర, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు హయాంలోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ నాయకులు అన్నారు. మంగళవారం కైపాకం పంచాయతీలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడాది ప్రభుత్వ పాలనపై ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. తెలుగు రైతు రాష్ట్ర ప్రచార కార్యదర్శి రవి నాయుడు, నాయకులు రవికుమార్, జయచంద్రనాయుడు, హరి, పశురాం, సుబ్రహ్మణ్యం, రమేష్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కోదండరామస్వామి ఆలయంలో కుంభాభిషేకం

విజయపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నరపరాజుకండ్రిగలోని సీతా లక్ష్మణ సమేత కోదండరామస్వామి ఆలయంలో జీర్ణోద్ధరణ అష్టబంధన మహా కుంభాభిషేకాన్ని రెండో రోజైన మంగళవారం వైభవంగా నిర్వహించారు. రాత్రి టీటీడీ ఆధ్వర్యంలో అన్నమయ్య కీర్తనలు, వెంకటేశ్వర్లు భాగవతారుచే హరికథా కాలక్షేపం జరిగింది. ఆలయ పూజారి వందవాసి మహేష్‌శర్మ, పురోహితులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేరుశనగలో కలుపు నివారణపై అవగాహన


పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖాధికారులు

తవణంపల్లె, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వేరుశనగ పంటలో కలుపు నివారణపై ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త సంధ్యారాణి అవగాహన కల్పించారు. మంగళవారం మిట్టపల్లెలోఆనంద్ నాయుడు క్షేత్రంలోని వేరుశనగ పంటలో డిక్లో సులామ్ పిచికారీని పరిశీలించారు. డాక్టరు సుమతి, రైతులు పాల్గొన్నారు.

గ్రావెల్ అక్రమ రవాణాను ఆపండి


గ్రామస్తులతో మాట్లాడుతున్న తహసీల్దార్ కిరణ్

విజయపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మహారాజపురంలో గ్రావెల్ అక్రమ రవాణాను ఆపాలని చేయాలని గ్రామస్తులు, వైసీపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం మహారాజపురం వద్ద గ్రావెల్ తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకుని బిల్లులను పరిశీలించారు. నగరి మండలం కాకవేడు రెవెన్యూ సర్వే నెంబర్ 12/పి పేరుతో బిల్లులు తీసుకుని మహారాజపురంలో గ్రావెల్ తరలిస్తున్నారని ఆరోపిస్తూ తహసీల్దార్ కిరణ్‌కు సమాచారం అందించారు. తహసీల్దార్ సంఘటన స్థలం చేరుకుని బిల్లులను పరిశీలించారు. బిల్లులో తేడా ఉంటే గ్రావెల్ లారీలను సీజ్ చేస్తామన్నారు. వైసీపీ మండల అధ్యక్షుడు శివరాజు, ఉపాధ్యక్షుడు సతీష్‌యాదవ్, నాయకులు దిలీప్‌కుమార్, గిరి, పరందామన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కార్వేటినగరం 'ముస్లిం మైనారిటీ కార్యవర్గం'


నియాజ్ - ఫయాజ్

వెదురుకుప్పం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండల ముస్లిం మైనారిటీ అధ్యక్షుడిగా నియాజ్, ప్రధాన కార్యదర్శిగా ఫయాజ్ నియమితులయ్యారని టీడీపీ మండల అధ్యక్షుడు చెంగ్రాయయాదవ్, ప్రధానకార్యదర్శి రాజేంద్ర రెడ్డి మంగళవారం తెలిపారు. అలాగే కార్యవర్గ సభ్యులను నియమించినట్లు చెప్పారు.

గుడ్డికండ్రిగలో లక్ష్మమ్మ తిరునాళ్ల


లక్ష్మమ్మను దర్శించుకున్న గ్రామస్తులు, పొంగళ్లు సిద్ధం చేస్తున్న మహిళలు

నగరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నగరి మండలంలోని గుడ్డికండ్రిగలో లక్ష్మమ్మ తిరునాళ్లను మంగళవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారి గుడి వద్ద పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. గ్రామపెద్ద కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

కీళపట్టులో పాలకుండల ఉత్సవం


పాలకుండలు తీసుకెళుతున్న భక్తులు

నగరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని కీళపట్టులో భద్రకాళి అమ్మవారికి ఆడిపూరంను పురస్కరించుకుని పాలకుండల ఉత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలకుండలను తలపై పెట్టుకుని ఊరేగింపుగా అమ్మవారి ఆలయానికి తీసుకొచ్చారు. అనంతరం ఆ పాలతో అమ్మవారికి అభిషేకం చేశారు. ఆలయం వద్ద మహిళలు పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. నిర్వాహకులు భక్తులకు అన్నదానం చేశారు.

పూతలపట్టులో కమలానంద భారతి



పూతలపట్టు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): 'మన దేవాలయాలను మనమే కాపాడుకుందాం' నినాదంతో రాయలసీమ జిల్లాల్లో భువనేశ్వరి పీఠాధిపతి కమలానంద భారతి స్వామి చేపట్టిన పాదయాత్ర మంగళవారం సాయంత్రం పూతలపట్టుకు చేరుకుంది. మండలకేంద్రంలోని వరదరాజస్వామి ఆలయాన్ని సందర్శించి, హిందూ ధార్మిక సభ్యులతో హిందూ దేవాలయాల విశిష్టత గురించి కమలానంద భారతి వివరించారు. స్థానికులు పాల్గొన్నారు.

రికవరీ శాతం పెంచాలి: డీసీసీబీ సీఈవో


అధికారులతో చర్చిస్తున్న శంకర్‌బాబు

నగరి, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): రికవరీ శాతం పెంచాలని డీసీసీబీ సీఈవో శంకర్‌బాబు పిలుపునిచ్చారు. స్థానిక డీసీసీబీ బ్రాంచి కార్యాలయంలో నగరి, విజయపురం పీఏసీఎస్ సీఈవోలతో మంగళవారం సమీక్షించారు. రైతులు పొందిన దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలపై ప్రభుత్వం కల్పించే రాయితీ సదుపాయాలను తెలియజేయాలన్నారు. పీఏసీఎస్‌లలో రూ.3లక్షల వరకు రైతులకు రుణాలు ఇచ్చే సదుపాయం కల్పించడం జరుగుతోందన్నారు. ఏజీఎం సురేష్‌బాబు, బ్రాంచ్ మేనేజర్ విజయ భాస్కర్‌రెడ్డి సూపర్‌వైజర్లు ఆనంద్, శ్రీకాంత్, సీఈవోలు తులసి పిళ్ళై, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

యువత మంచి ఆలోచనలతో ముందుకెళ్లాలి: డీఎస్పీ

నగరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): యువత మంచి ఆలోచనలతో ముందుకెళ్లాలని డీఎస్పీ అజీజ్ సూచించారు. నగరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన యాంటీ డ్రగ్స్, ర్యాగింగ్‌పై జరిగిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. ప్రిన్సిపాల్ వెంకటాచలపతి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో తనిఖీలు

వెదురుకుప్పం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వెదురుకుప్పం ఎంపీడీవో కార్యాలయాన్ని మంగళవారం జడ్పీ సీఈవో రవికుమార్‌నాయుడు తనిఖీ చేశారు. మండలంలో అభివృద్ధి, సంక్షేమకార్యక్రమాలపై ఎంపీడీవో పురుషోత్తంను అడిగి తెలుసుకున్నారు. వెదురుకుప్పం కొత్త వాణిజ్య సముదాయంపై ఆరా తీసి, సూచనలిచ్చారు.

'గృహ నిర్మాణాలను పూర్తి చేయండి'

చిత్తూరు అర్బన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని కమిషన్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. మంగళవారం నగరపాలక కార్యాలయంలో హౌసింగ్ అధికారులు, అమినిటీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ప్రసంగించారు. ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఏఈ శ్రీధర్ పాల్గొన్నారు.

కూలడానికి సిద్ధంగా బస్‌షెల్టర్

ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు


రాచపాళ్యంలో బస్‌షెల్టర్ దుస్థితి

పాలసముద్రం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు-బలిజకండ్రిగ రోడ్డులో రాచపాళ్యం కూడలి ప్రాంతంలో ఉన్న బస్ షెల్టర్ కూలడానికి సిద్ధంగా ఉంది. సుమారు 25 ఏళ్ల కిందట నిర్మించిన ఈ బస్ షెల్టర్‌కు మరమ్మతులు చేయకపోవడంతో అధ్వానంగా తయారైంది. ఎప్పుడు కూలిపోతుందో తెలియక ప్రయాణికులు రోడ్డుపక్కన ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతం నుంచి ఎక్కువ మంది తమిళనాడుకు వెళుతుంటారు. తమిళనాడు నుంచి వచ్చే వారు సైతం ఇక్కడ వేచి ఉండి, బెంగళూరుకు బస్సుల్లో వెళతారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఈ బస్‌షెల్టర్‌ను తొలగించి కొత్తది నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎస్టీకాలనీలోని సమస్యలపై కలెక్టర్‌కు నివేదిస్తా

● విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్



గంగాధరనెల్లూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): తూగుండ్రం పంచాయతీ దాసరపల్లె (వేణుగోపాలపురం) ఎస్టీకాలనీలో నెలకొన్న సమస్యలపై కలెక్టర్ సుమిత్‌కుమార్‌కు నివేదిక సమర్పిస్తానని విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ రవి తెలిపారు. ఎస్టీకాలనీని మంగళవారం ఆయన సందర్శించి, స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారికి సీడీటీ సంస్థ ద్వారా అన్నదానం చేశారు. మానవహక్కుల రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ భూపతి, సీడీటీ డైరెక్టర్ హరీష్, ఎన్‌వైఎస్ఎస్ అధ్యక్షుడు మునికృష్ణ, క్రాస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు దొరస్వామి, లత, విజయన్ పాల్గొన్నారు.

స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న రవి →

'స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్'పై కేంద్ర బృందం పర్యటన


వెజ్జుపల్లెలోని స్కూల్ వద్ద కేంద్ర బృందంతో జడ్పీ సీఈవో రవికుమార్

గంగాధరనెల్లూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): 'స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్'లో భాగంగా వెజ్జుపల్లె గ్రామంలో కేంద్ర బృందానికి చెందిన అధికారులు దాము, గోవిందస్వామి మంగళవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్‌డబ్ల్యుపీసీ కేంద్రం నిర్వహణ, ఎరువుల తయారీ, పారిశుధ్య పనులు, వ్యక్తిగత మరుగుదొడ్ల వినియోగం, ఆరోగ్య ఉపకేంద్రం, స్కూల్, అంగన్‌వాడీ కేంద్రాలవద్ద పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు, డీఎల్‌పీవో సుధాకర్‌రావు, మండల స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ మనోహర్‌బాబు, పంచాయతీ కార్యదర్శులు శివయ్య, ప్రశాంత్, ఎస్‌డబ్ల్యూఎం కన్సల్‌టెంట్ బాలసుందరం, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

మసీదు తాత్కాలిక కమిటీకి నోటీసు?


నోటీసు అందుకుంటున్న హమీద్‌ఖాన్

వెదురుకుప్పం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం పట్టణంలో ఉన్న జామియా మసీద్ తాత్కాలిక అధ్యక్షుడు/ముతవల్లి హమీద్‌ఖాన్‌కి జిల్లా వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టరు, ఆడిటర్ గౌస్ మొహిద్దీన్ నోటీసు జారీ చేశారు. వక్ఫ్ బోర్డు చట్టం ప్రకారం ప్రతి ఏడాదీ మసీదుకు వచ్చే ఆదాయం, జమా ఖర్చులను వక్ఫ్ బోర్డు (చిత్తూరు) వారికి చూపించడం లేదని, వచ్చే ఆదాయంలో ఏడు శాతాన్ని రాష్ట్ర వక్ఫ్ బోర్డుకి పన్ను చెల్లించడం లేదన్నారు. రాష్ట్ర వక్ఫ్ బోర్డు అనుమతి లేకుండా నిర్మాణాలు, పనులు చేయకూడదన్నారు. ఈ నోటీసు తీసుకున్న వారంలోపు మసీదు ఆదాయం, జమా ఖర్చులను తెలియజేయాలన్నారు. లేదంటే వక్ఫ్ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు. అలాగే పోలీసులకు ఫిర్యాదు చేసి.. క్రిమినల్ చర్యలు తీసుకుంటామన్నారు.

విలువలతో కూడిన జీవనం సాగించండి


సమావేశంలో ప్రసంగిస్తున్న ప్రదీప్

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): విలువలతో కూడిన జీవనం సాగించాలని యువతకు నెహ్రూయువ కేంద్ర జిల్లా యువజన అధికారి ప్రదీప్ సూచించారు. అంతర్జాతీయ యువ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎస్పీ సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మనోహర్, తెలుగు శాఖ అధ్యక్షురాలు ఉషారాణి ప్రసంగించగా, ఎన్ఎస్ఎస్ అధికారి అక్తర్, విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆరిమాని గంగమ్మకు ప్రత్యేక పూజలు


పొంగళ్లు తీసుకెళ్తున్న భక్తులు

శ్రీరంగరాజపురం, ఆగస్టు 12(ఆంధ్రజ్యోతి): 49.కొత్తపల్లెమిట్టలో గంగమ్మ జాతర సందర్భంగా మంగళవారం ఆరిమాని గంగమ్మకు మహిళలు పొంగళ్లు సమర్పించారు. యువకులు వివిధరకాల వేషధారణలతో అలరించారు. సర్పంచ్ డీవీ డిల్లెయ్య, పవన్ ప్రసాద్, బిగ్‌బాస్, షైఖేల్, సీకే బాబు, నాగేంద్రబాబు, సతీష్, వినయ్, దాము, సెహ్వాగ్, తరుణ్, వెంకటేష్, మణిశేఖర్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


పాతార్కాడులో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

విజయపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని టీడీపీ నాయకులు తెలిపారు. ఇళ్లత్తూరు 222వ బూత్‌లో మంగళవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏడాది ప్రభుత్వ పాలనపై ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, సీనియర్ నాయకుడు మునిభాస్కర్‌రాజు, నాయకులు ఏళుమలై, వరదరాజులు, కపిల్, బాబు తదితరులు పాల్గొన్నారు.

35 మద్యం బాటిళ్ల స్వాధీనం: విక్రేత అరెస్టు

పాలసముద్రం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తెలిపిన వివరాల మేరకు.. కల్లు అమ్మే మణి, మద్యం బాటిళ్లను తమిళనాడు సరిహద్దు వద్ద అక్రమంగా విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లగా గంగమాంబాపురంలో పట్టుబడ్డాడు. అతడి వద్ద ఉన్న 35 మద్యం (క్వార్టర్) బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేశారు.

మత్తుతో జీవితాలు నాశనం


వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీతమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటా చలపతి, అధికారులు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మత్తుకు బానిసలైతే జీవితాలు నాశనమవుతాయని సీతమ్స్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటాచలపతి అన్నారు. మంగళవారం మ్స్ కళాశాలలో 'మద్యపానం- మత్తుపదార్థాలపై' విద్యార్థులకు అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మద్యం, గంజాయికి దూరంగా ఉండాలని హెచ్చరించారు. వికలాంగుల శాఖ అధికారి రాజశేఖర్ నాయుడు మాట్లాడుతూ.. యువత మత్తుకు బానిసై బంగారు జీవితాలను నాశనం చేసుకుంటుందోని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో డాక్టర్ ప్రతిమ, కళాశాల హెచ్‌వోడీ బాలకృష్ణ, పాస్ సంస్థ నిర్వాహకులు పాల్గొన్నారు.

'ఓర్వలేక బురద చల్లుతున్న వైసీపీ'


రమేష్‌రాజు

విజయపురం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ పనితీరును చూసి ఓర్వలేకనే వైసీపీ నేతలు బురద చల్లుతున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు అన్నారు. కడప జిల్లా ఒంటిమిట్ట, పులివెందులలో జడ్పీటీసీ స్థానాలకు మంగళవారం ఉప ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. అక్కడి ఓటర్లకు ప్రజాస్వామ్యం అంటే ఏమిటో ఇపుడు తెలిసిందన్నారు. దీన్ని వైసీపీ నేతలు తట్టుకోలేక పోతున్నారని మండిపడ్డారు.

నులిపురుగులను నులిమేద్దాం


చిన్నారితో ఆల్బెండజోల్ మాత్ర మింగిస్తున్న పవన్‌కుమార్

వెదురుకుప్పం, ఆగస్టు12 (ఆంధ్రజ్యోతి): ఆల్బెండజోల్ మాత్రతో నులి పురుగులను నులిమేద్దామని రాష్ట్ర నోడల్ అధికారి పి.పవన్‌కుమార్ పిలుపునిచ్చారు. జాతీయ నులిపురుగుల నివారణ దినం సందర్భంగా మంగళవారం పచ్చికాపల్లం, వెదురుకుప్పం, పాతగుంటలో ఆల్బెండజోల్ మాత్రలు మింగించే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. డాక్టర్ బీవై కృష్ణచైతన్య, సీహెచ్‌వో కొప్పేడు మధుసూదన్, ఎంపీహెచ్ఎస్ ఈశ్వరమ్మ, ఎంపీహెచ్ఏ పి.కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గణపతి హోమం


పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు

గంగాధరనెల్లూరు, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గరిగెలపల్లెలో నూతనంగా నిర్మించిన గణపతి, దక్షిణమూర్తి, మహాలక్ష్మి, విద్యాసరస్వతి ఆలయంలో గణపతి హోమం, కలశపూజలను అర్చకులు మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. చిత్తూరు మాజీ కార్పొరేటర్ వసంతకుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు సుబ్రహ్మణ్యస్వామి, నాగాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

ఐరాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): గార్గేయ నదీ తీరాన మఠంపల్లె మిట్టలో ఉన్న భద్రాకాళీ సమేత సంగమేశ్వర స్వామి ఆలయంలో బుధవారం సుబ్రహ్మణ్యస్వామి, నాగాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ చేయనున్నారు. ఈ మేరకు విగ్రహ ప్రతిష్ఠాపకులు యబ్బూరి సిద్ధయ్యశెట్టి కుటుంబ సభ్యులు మంగళవారం తెలిపారు. గురువారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నగరంలో సంకటహర చతుర్థి పూజలు

చిత్తూరు కల్చరల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ఆలయాల్లో సంకటహర చతుర్థి పూజలను మంగళవారం భక్తులు నిర్వహించారు. చిత్తూరు షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో సంపద వినాయక, గిరింపేట శివగామి సుందరి సమేత చిదంబరేశ్వర, దుర్గానగర్‌కాలనీ సర్వసిద్ధి, కట్టమంచి కులందేశ్వర, కామాక్షి అంబికా సమేత అగస్త్యేశ్వర ఆలయాల్లో ఈ పూజలు జరిగాయి.

తూతూమంత్రంగా 'ఉపాధి' ప్రజావేదిక


కూలీలు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు


సమావేశానికి హాజరైన అధికారులు, సిబ్బంది

నగరి, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ప్రజావేదిక నగరి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో తూతూమంత్రంగా జరిగింది. కేవలం ఉపాధి హామీ పథకం సిబ్బంది, జిల్లా అధికారులు, సామాజిక తనిఖీ చేసిన సిబ్బంది, మండల అధికారులు మాత్రం పాల్గొన్నారు. కూలీలు హాజరుకాలేదు. నగరి మండల పరిధిలోని 21 పంచాయతీల్లో 2024 ఏప్రిల్ ఒకటి నుంచి 2025 మార్చి 31వ తేదీవరకు చేపట్టిన పనులపై 20 రోజులుగా సామాజిక తనిఖీ చేపట్టారు. దీనిపై మంగళవారం బహిరంగ ప్రజావేదికను ఏర్పాటు చేశారు. 665 పనులకు రూ.6,97,73,103 విడుదల చేయగా కూలీల ఖర్చు కింద రూ.6,23,04,840, మెటీరియల్ ఖర్చుకు రూ.74,68,263 వెచ్చించారు. సామాజిక తనిఖీలో గుర్తించిన తప్పుల కారణంగా రూ.69,277 రికవరీ చేయాలని డ్వామా పీడీ రవికుమార్ ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్టీఎం లోకేష్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ మురహరి, ఎంపీపీ భార్గవి, జడ్పీటీసీ గాంధీ, ఏపీవోలు కవిత, ఇందు, సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

వయోజన విద్యపై శిక్షణ

పాలసముద్రం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): వెలుగు కార్యాలయంలో సంఘమిత్రలకు వయోజన విద్యపై మంగళవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో విద్యావతి మాట్లాడుతూ.. మండలంలో నిరక్షరాస్యులుగా ఉన్న 15-55 ఏళ్లవారిని ఉల్లాస్ పథకం ద్వారా అక్షరాస్యులుగా మార్చాలని సూచించారు. ఎంఈవో-2 గిరిజ, ఏపీఎం కల్పలతారెడ్డి, ఏపీవో మార్గరేట్, వెలుగు సీసీలు పాల్గొన్నారు.

చక్రపాణిరెడ్డికి పరామర్శ

నింద్ర, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ట్రస్టు బోర్డు మాజీ చైర్మన్, టీడీపీ నాయకుడు రెడ్డివారి చక్రపాణిరెడ్డిని ఎమ్మెల్యేలు గాలి భానుప్రకాష్, ఆదిమూలం పరామర్శించారు. ఇటీవల ఆయనకు గుండె ఆపరేషన్ జరిగిన సంగతి తెలిసిందే.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి పూజలు



వెదురుకుప్పం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుడికి మంగళవారం విశేష పూజలు చేశారు. పలు గ్రామాల నుంచి భక్తులు కావళ్లు తీసుకొచ్చి సమర్పించారు.

బంగారమ్మకు నిమ్మకాయలతో అలంకరణ



వెదురుకుప్పం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం గ్రామ దేవత బంగారమ్మకు మంగళవారం నిమ్మకాయలతో అలంకరణ చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో భక్తులు పొంగళ్లు పెట్టి, నైవేద్యం సమర్పించారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త కొప్పేటి ప్రసాద్ పర్యవేక్షించారు.

ర్యాగింగ్ చేస్తే కఠిన శిక్ష

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): ర్యాగింగ్ చేస్తే కఠిన శిక్ష ఉంటుందని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జీవనజ్యోతి అన్నారు. యాంటీ ర్యాగింగ్ డే సందర్భంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యాసామగ్రి వితరణ



బంగారుపాళ్యం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): శేషాపురం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో చదువుతున్న విద్యార్థులకు గ్రామానికి చెందిన ప్రవాసభారతీయుడు గుడివాడ చరణ్ మంగళవారం విద్యాసామగ్రి వితరణ చేశారు. మురళీనాయుడు, త్యాగరాజులునాయుడు, జాకీర్ హుస్సేన్, గోపినాయుడు, ఉపాధ్యాయులు షణ్ముగం,శశికళ, గ్రామస్తులు పాల్గొన్నారు.

'యూకో బ్యాంకు' గ్రామసభ

ఐరాల, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): పాతపాళ్యంలో యూకో బ్యాంకు తరఫున గ్రామసభను మంగళవారం నిర్వహించారు. చీఫ్ మేనేజర్ ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ ఆర్ఈ కేవైసీ, పీఎంఎస్‌బీవై, పీఎంజేజేవై, ఏపీవై ప్రాముఖ్యతను వివరించారు. ఏపీజీబీ మేనేజర్ రజీవుల్లా, బ్రాంచ్ మేనేజర్ ఎస్.భానుచందర్, అసిస్టెంట్ మేనేజర్ తేజ, దిక్పతి, బాషా, జవహర్, ఖాతాదారులు పాల్గొన్నారు.

మహిళ మెడలో గొలుసు దోపిడీ

గంగవరం, ఆగస్టు 12 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో సుమారు రూ.4లక్షల బంగారు గొలుసు లాక్కెళ్లారు. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. గంగవరంలోని సాయిప్యాలెస్ వెనుక కాపురం ఉన్న శ్రావణి ఇంటి ముందు వెళ్తుండగా.. ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి మాటలు కలిపారు. ఇంతలోనే ఆ ఇద్దరు ఆమెతోపాటు ఇంట్లోకి వెళ్లి తలుపులు మూసి అరిస్తే చంపేస్తామని బెదిరించారు. ఆమె మెడలో ఉన్న సుమారు రూ.4 లక్షలు విలువ చేసే 32 గ్రాముల బంగారు గొలుసును లాక్కొని పరుగులు తీశారు. ఇంతలోనే శ్రావణి కేకలు వేయడంతో సమీప ప్రజలు వచ్చేలోపు దొంగలు వెళ్లిపోయారు. బాధితురాలు మంగళవారం రాత్రి గంగవరం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.